Follow: @ANNTELUGU
02-12-2024
# మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 01 పేజీలు-09 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సీఎంఆర్ఎఫ్‌లో కొత్త రికార్డు

**ఏడాదిలోనే రూ.830 కోట్ల సాయం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఔదార్యం

1.66 లక్షల కుటుంబాలను ఆదుకున్న ప్రభుత్వం

పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు పునర్జన్మ

గతంలో సీఎంఆర్ఎఫ్ లో జరిగిన అవకతవకలకు చెక్

వివరాలు 4లో

కేసు



### ఈవీఎంను హ్యాక్ చేస్తా

- ఓ యువకుడి ఛాలెంజ్
- ఈసీ ఫిర్యాదుతో కేసు నమోదు

02

బాసు

### ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షా



- రెండేళ్ల పాటు సేవలు అందించనున్న కొత్త చైర్మన్
- పదవి చేపట్టిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు

07

రేసు

### నాగబాబుకు షాక్



- రేసులోకి బీసీ నేత ఆర్. క్రిష్ణయ్య
- లెక్కలు మార్చేసిన బీజేపీ అధిష్టానం

02



## కాంగ్రెస్‌తో పొత్తు లేదు

**ఢిల్లీలో ఆప్ ఒంటరి పోరు**

**అరవింద్ కేజ్రీవాల్**

**మహా:** రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ఆదివారం వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ఇలాంటి ప్రకటన చేయడం వల్ల ఇండియా కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది.



## ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

**మహా, హైదరాబాద్:** ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లో రైతు భరోసా, కులగణనతో పాటు పలు అంశాలపై చర్చ ప్రధానంగా చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఏడాది పాలనపై చర్చించే అవకాశముంది. ఇదిలా ఉంటే.. రైతు భరోసా విధివిధానాలపై శాసనసభలో మాట్లాడుతామంటూ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని పలు అంశాలకు సంబంధించి నిలదీయాలనే యోచనలో ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఉంది.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,000 |
| 22 క్యారెట్ | 71,500 |
| సిల్వర్ (కేజీ) | 91,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,802.79 |
| నిఫ్టీ ↗ | 24,131.10 |


### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | ₹ 6.05 | 181.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | ₹ 6.05 | 181.5 |
| రిటైల్ గుడ్డు ధర | ₹ 6.41 | 192.39 |

# కాల్చిచ్చు

## కేటీఆర్ వర్సెస్ కవిత

### కవిత యాక్టివ్.. కేటీఆర్ ఇన్ యాక్టివ్



కవిత కారణంగానే పార్టీకి చిక్కులు వచ్చాయని భావిస్తున్న కేటీఆర్

ఏడాదికాలంగా పార్టీకి జవసత్వాలు తెచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డిన కేటీఆర్

ఇపుడు కవిత రీఎంట్రీపై అభ్యంతరాలు

ఇప్పుడు యాక్టీవ్ కావాల్సిన అవసరమేమొచ్చిందంటున్న కేటీఆర్ ఆంతరంగికులు

ఏపీ తరహాలో.. అన్నా చెల్లెల్ల మధ్య వైరుధ్యాలు

02



## సంక్రాంతికి రైతు భరోసా

**రైతులకు శుభవార్త చెప్పిన సీఎం**

రాష్ట్రాన్ని అప్పుల మయంగా చేశారు

వడ్డీలకే నెలకు రూ. 6500 కోట్లు కడుతున్నాం

గత ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతులపై భారం

రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ప్రాధాన్యత.. సీఎం రేవంత్ రెడ్డి


**హైదరాబాద్, మహా :** రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభవార్త తెలిపారు. రైతు భరోసాను కొనసాగిస్తామని అన్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా పైసలు వేస్తామన్నారు. రైతు భరోసాపై ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ వేశామని, అసెంబ్లీలో చర్చించి విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతోనే భోజనం వడ్డించేలా ఆదేశాలు ఇచ్చామని అన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను అప్పులమయంగా చేశారన్నారు. ఏడాదిలోనే రూ. 20వేల కోట్ల రుణమాఫీ చేశామని, ఇది దేశంలోనే ఒక రికార్డు అని చెప్పారు. సన్నాలకు రూ. 500బోనస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ రూపంలో వచ్చే మారీచులను రైతులు నమ్మొద్దన్నారు. బీపీటీ, హెచ్ఎంటీ, తెలంగాణ సోనా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తుందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుజరాత్ గులామని విమర్శించారు.

మిగతా 2లో

వినియోగదారులకు షాక్ ఇచ్చిన

## చమురు కంపెనీలు..

**వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు..**



వివరాలు 2లో

**ఆరు అబద్ధాలు**

## 66 మోసాలు

**రేవంత్ రెడ్డి ఏడాది పాలనపై బీజేపీ చార్జిషీట్ విడుదల**

- ఏడాదిలో చేస్తామన్నవే పేర్కొన్నామన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- హామీల అమలుపై రేవంత్‌తో చర్చకు సిద్ధం
- బూతులు మాట్లాడనంటే చర్చిస్తానని షరతు



వివరాలు 2లో

## ములుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్..

**మావోయిస్టు కీలక నేత భద్రు సహా ఏడుగురు మృతి**

చల్పాక సమీప అటవీ ప్రాంతంలో ఘటన

ఘటనా స్థలంలో రెండు ఏకే 47, రైఫిల్స్ స్వాధీనం

ఎన్‌కౌంటర్‌లో హతమైన ఇల్లందు – నర్సంపేట ఏరియా కమిటీ సభ్యులు



**ములుగు, మహా:** జిల్లాలోని ఏటూరు నాగారం చల్పాక అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. కూంబింగ్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. పీఎల్ జీఏ వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ లో భాగంగా చల్పాక పూలకొమ్మ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందారు.

మిగతా 2లో

## పాల్వంచ చెక్ పోస్టులో.. పైసా వసూల్

**ప్రైవేట్ వ్యక్తులతో అధికారుల దందా**

ముడుపుల మత్తులో అక్రమాలకు రైట్ రైట్

అక్రమ ఇసుక రవాణా లారీలే టార్గెట్

పశువులు, గంజాయి రవాణా వీరి కనుసైగల్లోనే

మంత్రి హెచ్చరించినా అదే దందా

ప్రతిరోజూ లక్షల్లో వసూళ్ళు


**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా :**

కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు అసలు కంటే కొసరే ఇష్టం. ఆమ్యామ్యాల మత్తులో మునిగి తేలుతూ.. అసలు బాధ్యతలు విస్మరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటూనే సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే లంచావతారమెత్తి అవినీతి జలగలుగా తమను పట్టి పీడిస్తున్నారని వాహన దారులు లబోదిబోమంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ ఆర్‌టీఏ చెక్‌పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు అక్రమ ఆదాయం కోసం పక్క దారి పట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెక్ పోస్ట్ పరిసరాల్లో ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని వారి ద్వారా పనులు చక్కబెడుతున్న అధికారులు ప్రతి వాహనానికి ఒక్కో రేటు నిర్ధారించి వాహనాలు తనిఖీలు చెప్పట్టకుండా రైట్ రైట్ చెబుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీవాహనం నుండి మూడు చక్రాల ఆటో వరకు ఈ చెక్ పోస్ట్ ముందు నుండి కదలకుండా కేవలం ముడుపుల వైపే దృష్టి పెట్టారనేది వాహన యజమానుల ఆరోపణ.

మిగతా 3లో



# కార్చిచ్చు



కార్చిచ్చు రగిలింది. ఇంతకాలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, తెలంగాణ ప్రభుత్వంమీద ఒంటికాలిపై లేచి.. ప్రభుత్వంపై వ్యతిరేకత రగిల్చేందుకు సర్వశక్తులు ఒడ్డిన కేటీఆర్ ఇపుడు ఒక్కసారిగా బ్రేక్ తీసుకుంటున్నా అని ప్రకటించడం సంచలనంగా మారింది. ఆరోపణలు, వ్యంగ్యాస్త్రాలు, విమర్శలు, ఆందోళనలు.. రూపం ఏదైనా తన పొలిటికల్ కెరీర్ లో ఎన్నడూ పడనంత కష్టం, రాజకీయ వ్యూహాలు అమలుచేసి తాను పరుగెడుతూ సర్కారును పరుగెత్తించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇపుడు రాజకీయాలకు విరామం ప్రకటించడం ఆశ్చర్యం హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ ప్రకటన వెనుక కార్చిచ్చు.. కుటుంబ వ్యవహారాలే అని వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కవిత లిక్కర్ స్కామ్ పై పెద్ద ఎత్తున చర్చ జరగ్గా, బిఆర్ఎస్ ఓటమి కారణాల్లో ఈ స్కాంపై జరిగిన దుష్ప్రచారం కూడా ఒకటని నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కవిత అరెస్ట్ కావడం, కవిత సుదీర్ఘకాలం జైలులో ఉన్నా ఆమెను బయటకు తెచ్చేందుకు కేటీఆర్ కూడా తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఘటనలు..సంఘటనలు ఏం ఉన్నా జైలు నుండి బయటకు వచ్చిన కవిత మళ్ళీ వేగంగా యాక్టివ్ కావడంపై కేటీఆర్ ఆంతరంగికులు విస్తుపోతున్నారు. ఇప్పటికే ఓ వైపు కేటీఆర్, మరోవైపు హరీష్ మధ్య పోటీ ఉంది. ఇపుడు కవిత యాక్టివ్ కావడంతో కేటీఆర్ ఇంతకాలం పడ్డ శ్రమ, భవిష్యత్తుపై ఒక్కసారిగా ముఖ్యుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా.. సెంటిమెంట్ ప్రకారం కేటీఆర్ కన్నా జైలుకెళ్ళొచ్చిన కవిత ముఖ్యమంత్రి సీరియల్ లో ముందువరుసలో ఉంటారని చెప్పారు. తెలంగాణలో ఎన్నికలు కూడా ఇప్పటికిపుడు లేవు. పార్టీ క్యాడర్, లీడర్లు అంతా యాక్టివ్ గా ఉన్నారు. అధినేత కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాకున్నా, కవిత జైలులో ఉన్నా.. కేటీఆర్ అన్నీ ఎదుర్కొని ప్రతిపక్షపాత్రను సమర్ధంగా పోషించారు. కవిత రీఎంట్రీ తర్వాత కేటీఆర్ బ్రేక్ ప్రకటించడం వెనుక ప్రధానంగా కుటుంబ అంతర్గత అంశాలే కారణంగా కనిపిస్తోందని ఆంతరంగికులు అంటున్నారు.

**- మహా,**
**ప్రత్యేక ప్రతినిధి**

## కేటీఆర్ పోస్ట్‌తో అలజడి

కేటీఆర్ తాజా పోస్ట్ గులాబీ పార్టీలోనే కాకుండా తెలంగాణ రాజకీయాల్లో అలజడికి కారణం అయ్యింది. కొత్త అంశం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ పార్టీలో ఇంటిపోరు సాగుతోంది.. ఈ క్రమంలోనే కేటీఆర్ ఇలా విరామం తీసుకుంటున్నారని రాజకీయనాయకులు అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ పగ్గాలను చేపట్టేందుకు కేటీఆర్, హరీశ్ రావు, కవిత.. ఈ ముగ్గురూ పోటీ పడుతున్నారని, ఇందుకు సంబంధించి ఎవరికి వారు పావులు కదుపుతున్నారని, ఇదంతా కూడా కేసీఆర్ కు ప్రస్తుతం పెద్ద తలనొప్పిగా మారిందని, అయితే, ఒక రకంగా కవిత తన పంతాన్ని నెగ్గించుకోబోతున్నారని, ఇందుకు సంబంధించి ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ లో కూడా చర్చలు జరిగాయని, దీంతో కేటీఆర్, హరీశ్ రావులు అలిగారని ఓ వర్గం ప్రచారం చేస్తోంది. అందుకే కేటీఆర్ విరామం తీసుకుంటున్నారేమోనని అనుకుంటున్నారు. ఇటు హరీశ్ రావు కూడా అసంతృప్తిగా ఉన్నారంటూ ప్రచారం జరుగుతుంది. ఏపీలో షర్మిల, జగన్ మధ్య నడుస్తున్న పోరు మాదిరిగానే ఈ ఎపిసోడ్ ఉండబోతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జగన్, షర్మిల మధ్య విబేధాలు వచ్చినప్పుడు కూడా ఇదే మాదిరిగా నెమ్మదిగా అసమ్మతి రాగం బయటకొచ్చిందని, ఆ తరువాత ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పరిస్థితి వచ్చి.. చివరకు ఢీ అంటే ఢీ అన్నట్లుగా ప్రస్తుతం కొనసాగుతుందని... ఇదే మాదిరిగా కల్వకుంట్ల కుటుంబంలో ఇంటిపోరు కొనసాగుతుందని, రానున్న రోజుల్లో ఈ పోరు బయటపడుతుందని అనుకుంటున్నారు.

## ఈవీఎంను హ్యాక్ చేస్తా

**మహా:** భారత్ లో గత కొంతకాలంగా ఈవీఎంల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న ఘటనలు ఎక్కువవుతున్నాయి. ఈవీఎం ఫలితాలను తారుమారు చేస్తున్నారంటూ పలువురు నేతలు బాహాటంగా ఆక్రోశిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సయ్యద్ షుజా అనే వ్యక్తి తాను ఈవీఎంలను హ్యాక్ చేసి చూపిస్తానంటూ ప్రకటించాడు. ఈవీఎం ఫ్రీక్వెన్సీని ఐసోలేట్ చేయడం ద్వారా ఫలితాలను మార్చవచ్చని చెప్పాడు. దీన్ని సీరియస్ గా తీసుకున్న మహారాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన ముంబయి సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద నవంబరు 30న కేసు నమోదు చేశారు.

## నాగబాబుకు షాక్



**మహా:** ఏపీలో రాజ్యసభ ఉప ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల కాగా, మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. దీని మీద ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి తీవ్ర కసరత్తు చేస్తోంది. నిజానికి మూడు ఎంపీ సీట్లు అంటే అందులో జనసేనకు ఒకటి దక్కుతుందని అలా మెగా బ్రదర్, జనసేన కీలక నేత నాగబాబుకు కచ్చితంగా రాజ్యసభకు వెళ్లే చాన్స్ ఖాయమని అంతా అనుకున్నారు. కానీ రోజురోజుకూ లెక్కలు మారుతున్నాయి. వైసీపీకి చెందిన ఆర్ క్రిష్ణయ్య తన ఎంపీ పదవికి రాజీనామా చేయడం వెనక కూడా ఒక లెక్క ఉందని అంటున్నారు. ఆయన ఈసారి బీజేపీ కోటా నుంచి ఢిల్లీలో పార్లమెంట్ లో అడుగు పెట్టాలని చూస్తున్నారు అని అంటున్నారు. అందుకే ఆయన రాజీనామా కంటే ముందే బేజేపీ నేతలతో ఆ విధంగా అంగీకారం పొందారని అంటున్నారు. దాంతో అనూహ్యంగా క్రిష్ణయ్య రేసులోకి దూసుకుని వచ్చారు అని అంటున్నారు. అలా బీజేపీ ఏపీ కోటాలో తన సీటుని దక్కించుకుంటుందని తెలుస్తోంది. ఇక మిగిలిన రెండు సీట్లలో బీద మస్తాన్ రావు కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. మధ్యలో ఆయన వైసీపీలోకి వెళ్ళి రాజ్యసభ సభ్యుడు అయ్యారు. ఆ పార్టీకి సీటుకు రాజీనామా చేస్తూనే టీడీపీ పెద్దలు తిరిగి తనను ఎంపీగా పంపించాలని మాట్లాడుకున్నారని అంటున్నారు. ఇక మూడోసీటు ఓసికి ఖాయమని, గల్లా జయదేవ్ తో పాటు మరో పది మంది రేసులో ఉన్నారని చెబుతున్నారు. జనసేనాని ఢిల్లీ పర్యటన సందర్భంగా అనేక ప్రతిపాదనలు వచ్చినా, చివరకు భవిష్యత్ రాజకీయ వ్యూహాల నేపథ్యంలో జనసేనకు బిజెపి మరో విడత అవకాశం ఇస్తామని చెప్పింది.

## సంక్రాంతికి రైతు భరోసా



(మొదటిపేజీ తరువాయి)

ఆయనకు తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలపై చర్చకు రావాలని మరోసారి సీఎం సవాల్ విసిరారు. రాష్ట్రంపై రూ. 7లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రతినెలా రూ. 6500 కోట్లు వడ్డీకే కట్టాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలాదిగజారిందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పుల గురించి గతంలో ఎవరూ బయటపెట్టలేదని చెప్పారు. ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ప్రతిపక్షాల మాటలను నమ్మొదని, ఇచ్చిన గ్యారెంటీలను అధైర్యపడకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులను రాజు చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. 2023 వానాకాలంలో రైతు బంధును కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇచ్చి తీరుతామని, తాము అధికారంలోకి రాగానే రూ. రూ. 7625 కోట్లు రైతుబంధు నిధులు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, అధికారంలోకి రాగానే అన్ని అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తుంది కాంగ్రెస్ ఒక్కటేనని పేర్కొన్నారు. నెహ్రూ నుంచి వైఎస్సార్ దాకా రైతులే మా ఎజెండా అన్న సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ బకాయి పెట్టిన రైతుబంధును మేం చెల్లించామన్నారు. అధికారంలోకి రాగానే రూ. 7,625 కోట్ల రైతుబంధు నిధులు చెల్లించామని, ఆగస్టు 15నాటికి 22.22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఆగస్టు 15నాటికి రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమచేయడం జరిగిందని, నిన్న (శనివారం) 3.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,747 కోట్లు వేశామన్నారు. ఇప్పటి వరకు 25.35 లక్షలమంది రైతుల ఖాతాల్లో.. రూ.21వేల కోట్లు జమ చేశామని, రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ రైతులను మోసం చేసింది కాబట్టి మమ్మల్ని కూడా అలా అనే ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లున్నారన్నారు.

రూ.2 లక్షల వరకు ఉన్న అందరికీ రుణమాఫీ పూర్తయిందన్నారు. ఖాతాల్లో పొరపాట్ల వల్ల ఆగిపోయిన వారికి శనివారం రుణమాఫీ చేయడం జరిగిందని, ఏమైనా మానవ తప్పిదాలతో జరగకపోతే మళ్లీ సరిదిద్దుతామనని సీఎం స్పష్టం ఛేశారు. ఖాతాల్లో తప్పులు సరిదిద్దుకుని అధికారులకు చెప్తే రుణమాఫీ పూర్తవుతుందని, రేషన్‌కార్డు లేని వారికి కూడా రుణమాఫీ చేశామని, మొదట్లో బ్యాంకు అధికారులు రుణమాఫీపై సరైన సమాచారం ఇవ్వలేదు, . బ్యాంకుల్లోని మొత్తం పాతబకాయిలు కలిపి రూ.30 వేల కోట్లుగా లెక్క చెప్పారన్నారు. ఏది ఏమైనా రైతులను అన్ని ఆకాలుగా ఆదుకుని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి ఆదుకుంటామని, ఇందులో ఎవరెన్ని ప్రచారాలు చేసినా నమ్మొద్దని ఐరోసారి రేవంత్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు.

## ఆరు అబద్ధాలు.. 66 మోసాలు




**హైదరాబాద్, మహా :** పదేళ్ళ బీఆర్ఎస్ పాలన ఏడాది రేవంత్ రెడ్డి పాలన ఒకేలా ఉన్నాయని, ప్రశఅనించిన వారిని అణగదొక్కడం, తప్పుడు కేసులు బనాయించడం, బూతులపై ఎదురు తిరగడం తప్ప ప్రజలకు జరిగిన మేలేమీ లేదని బీజేపీ రాష్ట్ర అఝ్యక్షుడు, కేంద్ర ఇంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఏడాది రేవంత్ పాలనపై ఆరు అబద్దాలు 66 మోసాలు పేరుతో ఆదివారం చార్జిషీట్ ను విడుదల చేసిన కిషన్ రెడ్డి ఏడాదిలో కాంగ్రెస్ చేస్తామని ప్రజలకిచ్చిన వాగ్దానాలపై చర్చించేందుకు సిద్ధమన్నారు. చర్చిస్తా కానీ సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడకుండా ఉండాలని షరతు విధించారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇంటింటికీ గ్యారంటీ కార్డు ఇచ్చారని, ఆ గ్యారంటీలను అమలు చేయకుండానే విజయోత్సవాలను నిర్వహించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అనేక ప్రాణత్యాగాలతో తెలంగాణ సాధ్యమైందని, ఏ ఆశయ సాధన కోసం ప్రజలు పోరాడి తెలంగాణ సాధించుకున్నారో ఆ ఆశయాలకు విరుద్ధంగా పదేళ్ళ పాట బీఆర్ఎస్ పాలన సాగిందన్నారు. బీఆర్ఎస్ పాలన తరహాలోనే కాంగ్రెస్ ఏాది పాలన కూడా సాగిందన్నారు. అయిదేళ్ళ సమయం ఉందిఅప్పుడే చార్జిషీట్లా అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలైప స్పందిస్తూ మేమేం అయిదేళ్ళ హామీలను ప్రస్తావించడం లేదు కేవలం 100 రోజుల్లో చేస్తామన్న హామీలను మాత్రమే ప్రస్తావించామని బదులిచ్చారు.

ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన నిలబజడి ప్రశ్నించే అధికారం తమకుందని, ప్రజల తరపున నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. 2023 డిసెంబర్ తొమ్మిది సోనియా గాంధీ జన్మదినం రోజున రుణమాఫీ చేస్తానని చెప్పి ఏడాది కావస్తున్నా ఇంకా కాలేదన్నారు. రైతు భరోసాను పూర్తిగా మరిచిపోయినట్లు ప్రభుత్వం ప్రవర్తిస్తుందన్నారు. పండించిన ప్రతి పంటకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే అని మాట మార్చడం రైతులను ధగా చేయడం కాదా అని ప్రశ్నించారు. లీటరు పాలకు రూ. 5 బోనస్ అని చెప్పి అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పోరాటం చేసిందని, ఇప్పుడు బలవంతంగా రైతుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అదికారంలోకి వస్తే ఉద్..ో గాల జాతర అని యువతను నమ్మించతిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక్క డీఎస్సీ కూడా వేయలేదన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. బస్తీ పాఠశాలలు తెరుస్తామని, కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తామని చెప్పారని, అవి చేయకపోగా ఉన్న పాఠశాలలను మూసి వేస్తున్నారన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన కాంగ్రెస్ పెద్ద నేతలు 18 ఏళ్ళు నిండిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్నారని, ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. రెండు వేల పెన్షన్ నాలుగు వేలని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు, రైతు బీమా ఏమయ్యాయని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఏక్కడికి పోయిందన్నారు. దళిత బంధు కింద బీఆర్ఎస్ రూ. 10 లక్షలని చెబితే కాంగ్రెస్ రూ. 12 లక్షలని చెప్పారని, ఇంతవరు ఆ పథకం ఊసెత్తడం లేదన్నారు. డబుల్ బెడ్ రూంలను ఇవ్వకపోగా హైడ్రా పేరుతో, మూసీ నవీకరణ పేరుతో ఉన్న ఇళ్ళను కూలుస్తున్నారని విరుచుకుపడ్డారు. జాబ్ క్యాలెండర్ ను అమలు చేస్తామని చెప్పినా ఏడాదిలో అమలు కాలేదని, యువత తరఫున బీజేపీ ప్రశ్నిస్తుందన్నారు. పరిశ్రమలకు బీజేపీ వ్యతిరేకం కాదన్న కిషన్ రెడ్డి రైతులతో మాట్లాడి ఒప్పించి భములు తీసుకోవాలన్నది తమ పార్ఛ్ విధానమని స్పష్టం చేశారు.

PCJ

## స్టాక్ స్ప్లిట్ కోసం తేదీని ప్రకటించిన పీసీ జువెల్లర్ లిమిటెడ్

**హైదరాబాద్, మహా :** దేశంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆభరణాల చైన్ పీసీ జువెల్లర్ లిమిటెడ్ (బిఎస్ఇ: 534809, ఎన్ఎస్ఇ: పీజీ జువెల్లర్ ) తన ఈక్విటీ షేర్లను 1:10 నిష్పత్తిలో విభజించడం (స్టాక్ స్ప్లిట్) కోసం డిసెంబర్ 16, 2024ను రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. అంటే, ఒక ఈక్విటీ షేర్‌ను పది ఈక్విటీ షేర్లుగా విభజిస్తారు.ఇటీవలి కాలంలో, కంపెనీ 3,38,85,000 వారెంట్లను ఈక్విటీ షేర్లు గా మార్చడం ద్వారా రూ. 142.82 కోట్ల నిధులు సమీకరించింది. ఈ వాటాలను 'నాన్‌ప్రొమోటర్, పబ్లిక్ కేటగిరీ'కి చెందిన 35 మందికి కేటాయించింది. 2024 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో పీసీ జువెల్లర్ అత్యుత్తమ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. క్యూ2 ఎఫ్ వై25లో రూ. 505 కోట్ల ఆదాయం నమోదు చేసి, 1430% వృద్ధిని సాధించింది. ఏబిటా రూ. 129 కోట్లు, పిబిటి రూ. 124 కోట్లుగా ప్రకటించారు.

## ములుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్..

(మొదటిపేజీ తరువాయి)

మృతుల్లో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న, జిల్లా కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ కోటి, ఏరియా కమిటీ సభ్యురాలు జమున, ఏరియా కమిటీ సభ్యులు కరుణాకర్ లుగా గుర్తించారు. ఇంకా ముగ్గురిని గుర్తించాల్సి ఉంది. సంఘటనా స్థలం నుండి రెండు ఏకే 47, ఒక జీ 3, ఒక ఐఎన్ఎస్ఏఎస్, ఒక 303 రైఫిల్, ఒక సింగిల్ షాట్, ఒక తపంచా, కిట్ బ్యాగ్ లు, మావోయిస్టు విప్లవ సాహిత్యం, సామగ్రిని స్వాధీనపరచుకున్నట్లు షబరీష్ పేర్కొన్నారు. పారిపోయిన మిగతా మావోయిస్ట్ పార్టీ సభ్యులు కూడా లొంగిపోవాలన్నారు. వారు లొంగిపోతే ప్రభుత్వపరంగా పునరావాసం కలిపించి, అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ సంఘటనపై ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఆయన వెల్లడించారు.

**భద్రు కోసం ఏళ్లుగా అన్వేషణ..**

గతంలో ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల యాక్షన్ టీం కమాండర్ గాను పనిచేసిన భద్రు 2022లో 20 రోజులు తాడ్వాయి అరణ్యంలో సంచరిస్తున్నట్టు నిఘావర్గాలు నాడు పసిగట్టాయి. ఆ సమాచారంతో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలు అడవిని జల్లెడపట్టాయి. వీరాపూర్ అటవీ ప్రాంతంలో దళాలు సేదతీరుతున్న సమయంలో పోలీసులు అక్కడికి చేరుకునేందుకు యత్నిస్తుండగా సెంట్రీ టీం అప్రమత్తమైంది. మావోయిస్టులు డెన్ను ఖాళీ చేసే క్రమంలో నిత్యావసరాలు, సామగ్రిని వదిలేసి వెళ్లారు. అయితే కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతి సమీపంలోకి రావడంతో కాల్పులు ప్రారంభించారు. పోలీసులు కూడా ఫైరింగ్ కు దిగారు. సుమారు 15 నిమిషాలపాటు ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసులకు చిక్కకుండా భద్రు టీం తప్పించుకుంది. ప్రస్తుతం పిఎల్ జిఏ వారోత్సవాల నేపథ్యంలో ములుగు జిల్లా ఏటూరునాగారం, వాజేడు, నూగూరు వెంకటాపురం అడవుల్లో మావోయిస్టు దళాలు సంచరిస్తున్నట్లుగా పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో పెనుగోలు ఘటన తర్వాత పోలీసు బలగాలు కూంబింగ్ ను తీవ్రతరం చేసి స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలు అడవిని జల్లెడపడుతున్నాయి. అయితే ఈసారి మాత్రం పోలీసులు పక్కా వ్యూహంతో మావోయిస్టులపై తుపాకీ తూటాలతో దాడి చేయగా మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లింది.

**అంతా యువరక్తమే..!**

మృతి చెందిన ఏడుగురు మావోయిస్టులలో 24 ఏళ్ల లోపు ఉన్నవాళ్లు ఐదుగురు ఉండటం గమనార్హం. దశాబ్దన్నరకాలం తర్వాత ములుగు జిల్లాలో జరిగిన భారీ ఎన్కౌంటర్ ఇదే. పోలీసు ఇన్ ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనే నెపంతో గత నెల 21 అర్ధరాత్రి సమయంలో ములుగు జిల్లా వాజేడులో పెనుగోలు కాలనీలో పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయికా రమేశ్, ఆయన సోదరుడు ఉయికా అర్జున్ను మావోయిస్టులు హతమార్చారు. వెంకటాపురంవాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట మావోయిస్టులు రెండు లేఖలను మృతదేహాల వద్ద వదిలి వెళ్లారు. ఈ ఘటన ములుగు జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ఏటూరునాగారంలో ఆదివాసీలు మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ సైతం నిర్వహించారు. శనివారం ఏటూరు నాగారం, వెంకటపూర్, వాజేడుల్లోనూ మావోయిస్టులకు వ్యతిరేకంగా బ్యానర్లు వెలిశాయి.

### ములుగు మార్చురీకి చేరుకున్న మృతదేహాలు

ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతం నుంచి పటిష్ట బందోబస్తు నడుమ ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి మావోయిస్టుల మృతదేహాలు తరలించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఉదయం నుండి సాయంత్రం వరకు రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులు పంచనామా పూర్తి చేశారు. సోమవారం ములుగు ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించనున్నారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించనున్నారు. మావోయిస్టు మృతదేహాలకు ఆస్పత్రి వద్ద గట్టి బందోబస్తును చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అనుమానితులను క్షుణ్ణంగా పోలీసులు తనిఖీ చేస్తున్నారు.










# పాల్వంచ చెక్ పోస్టులో.. పైసా వసూల్




(మొదటిపేజీ తరువాయి)

చెక్ పోస్ట్ సిబ్బంది వారి స్థాయిని బట్టి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. కొన్నేండ్లుగా ఈ లంచాల వ్యవహారం అటెండర్ నుంచి అధికారి వరకు యథేచ్ఛగా సాగుతుందనేది బహిరంగం రహస్యంగా కనిపిస్తున్న ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ అక్రమ దందా పై శాఖా పరంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై విస్మయం వ్యక్తమవుతోంది. మా దందా.. ఇంతే అన్నట్లుగా ప్రైవేట్ సైన్యం, వారికి అండగా కీలక అధికారులు వ్యవహరిస్తున్న తీరు చూసి విస్మయం వ్యక్తమవుతోంది. ప్రతీనెలా.. కోట్లల్లోనే ఈ దందా సాగుతుందన్న ఆరోపణలున్నాయి.

**వారి రూటే.. సపరేటు..**

పాల్వంచ ఆర్టీఏ చెక్‌పోస్టులో సిబ్బంది, అధికారులు బార్డర్ ట్యాక్స్, తాత్కాలిక పర్మిట్ ఫీజు, అపరాధ రుసుం, వాహన ఇన్సూరెన్స్, తదితర ధృవపత్రాలు తనిఖీలు చేయాలి. వస్తువుల రవాణాకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా..? లేవో..? చెక్ చేయాలి. కానీ ఇదంతా ఏం జరగకుండా చేతులు తడిపితే వాహనాలు వదిలేస్తున్నారనేది నిత్యకృత్యంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నా కానీ ఇక్కడే కొందరు అవినీతికి తెరలేపారు. వారి రూటే సపరేట్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పత్రాలు ఉన్నా లేకున్నా వాహనదారుల నుంచి డబ్బులు దండుకొని వాహనాలు వదిలేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి విచ్చలవిడిగా సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారిందని, చేతులు తడపనిదే వాహనాలు వదలడం లేదంటూ, అన్ని రకాల ధృవపత్రాలున్న ఆర్టీఏ సిబ్బంది ప్రతి వాహనం పై రూ.500 నుంచి వసూళ్లు చేస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అక్రమ ఇసుక, కలప, ఇతరత్రా అనుమతి లేని జీరో దందా రవాణాకు.. చేతులు తడిపితే జీహుజూర్ అంటూ గేట్లు ఎత్తేస్తారన్న చర్చ సర్వత్రా ఉంది. వీటి రేటు సపరేటు అన్నట్లుగా పై స్థాయిలోనే ఫిక్స్ అయిందన్న ప్రచారం స్థానిక వర్గాల్లో ఉంది.

**అక్రమ ఇసుక రవాణా లారీలే టార్గెట్..**

భద్రాద్రి జిల్లాలోని మణుగూరు, చర్ల, భద్రాచలం, పినపాక ఇసుక ర్యాంపు ల నుండి ప్రతిరోజు వందలాది లారీలు ఈ చెక్కు పోస్ట్ మీదుగా ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, హై దరాబాద్ కు ప్రయాణిస్తుంటాయి. ఇదే రవాణా శాఖ అధికారులుకు వరంగా మారింది. టన్నేజి, ఓవర్ లోడు పేరుతో ఒక్కో లారీ నుండి రూ. వెయ్యి నుండి మూడు వేల వరకు ఆర్టీఏ చెక్ పోస్టులో పెద్ద సార్ ఉన్నారంటూ వాహనదారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. పెద్ద సారు ఎవరనేది సిబ్బందికి మాత్రమే తెలుసు. కొందరు జిల్లా అధికారుల పేర్లు చెప్పి, ప్రజాప్రతినిధుల అండ ఉందని చెబుతూ ఇష్టానుసారంగా దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. వాహనానికి ఏ చిన్న కాగితం లేకున్నా వాహనం సీజ్ అవుతుందేమోనని వాహనదారులు భయపడి తమ జేబులో ఉన్న డబ్బులను సిబ్బందికి ఇచ్చి అక్కడ నుంచి జారుకుంటున్నారు. సిబ్బంది బహిరంగానే వసూళ్లు చేస్తున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని వాహనదారులు వాపోతున్నారు.

**పశువులు, గంజాయి రవాణా వీరి కనుసైగల్లోనే**

ఈ చెక్ పోస్ట్ లో కొందరు ప్రైవేటు వ్యక్తులు అధికారుల కనుసైగల్లో పశువులు, గంజాయి రవాణా చేసే వాహనాల వద్ద భారిగా అక్రమ వసూళ్లకు పాల్పడటం విశేషం. అక్రమ వ్యాపారాలు తమ రవాణా వాహనాలను అడ్డుకోకుండా ముందస్తుగానే మాట్లాడుకొని నెలవారి మామూళ్లు ముట్ట చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ చెక్ పోస్ట్ పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి రాజ్యమేలుతుందనే చెప్పాలి . కొందరు అధికారులు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని అక్రమంగా సంపాదిస్తున్నారని వినికిడి. చెక్ పోస్టులో జరుగుతున్న వసూళ్లపై అధికారులు నిఘా పెట్టాలని, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి హెచ్చరించిన సిబ్బంది, అధికారుల తీరు మారడం లేదని, చెక్ పోస్ట్ లో జరుగుతున్న అక్రమాల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి చెక్కు పోస్ట్ ను ప్రక్షాళన చేయాలని వాహన దారులు కోరుతున్నారు.



## టీవీ నటి శోభిత ఆత్మహత్య

**హైదరాబాద్, మహా :** కన్నడ బుల్లితెర నటి శోభిత (32) ఆత్మహత్య చేసుకున్నారు. భర్తతో కలిసి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాసం ఉంటున్న శోభిత ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆమె కన్నడలో పలు సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపుపొందారు. శోభిత భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. శోభిత మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు వెల్లడించలేదు. శోభిత మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# ఇళ్ళు కూల్చడం, భూములు లాక్కోవడం

**రేవంత్ ఈ రెండే చేస్తున్నాడు.. మల్కాజిగిరి ఎంపీ ఈటల**



**హైదరాబాద్, మహా :** రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో ఇళ్ళు కూల్చడం, భూములు లాక్కోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఆచరణలో అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీ ల పేరుట 66 హామీలు ఇచ్చి కేవలం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఎక్కడ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, ఆటో డ్రైవర్లు, కౌలు రైతులు అన్ని వర్గాల ప్రజలు.. ఈ ప్రభుత్వ నైజం తెలియడానికి 9 నెలల సమయమే పట్టిందని భావిస్తున్నారు. అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. ఏడాదిలో ప్రజలకు ఏం ఛేశారని సంబరాలు చేసుకుంటున్నారో పాలకులు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంబరాలకు వాస్తవం ఏంటో తెలియజెప్పే బాధ్యతలో భాగంగా బీజేపీ నియోజకవర్గాల వారీగా ప్రజలతో ముచ్చటించడం, సమస్యలు తెలుసుకోవడం, బైక్ ర్యాలీ నిర్వహించడం, ప్రజలతో సభలు ఏర్పాటు చేసి చైతన్య పరచడం, వాళ్లకు విశ్వాసం కలిగించడంలో భాగంగానే సరూర్ నగర్ స్టేడియంలో ఏడవ తేదీన సభ నిర్వహిస్తున్నామన్నారు. పెన్షన్లు కోల్పోయిన వారు, పెన్షన్ పెరుగుతాయని ఆశపడ్డారని, భంగపడ్డ ఆటో డ్రైవర్లు అనేక వర్గాల ప్రజలు ఆ సభలో పాల్గొని ఈ ప్రభుత్వానికి నిరసన చెప్పే బాధ్యత బీజేపీ తీసుకుంటుంది కాబట్టి ఆ సభను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వం అంటే ప్రజలను ఆదుకోవాలి కానీ ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత రెండే కార్యక్రమాలు చేస్తున్నాడని, ఒకటి ఇల్లు కూలగొట్టడం రెండు భూములు గుంజుకోవటమని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్న ఇళ్లను కూల్చి వేస్తున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్ స్కెచ్ వేశాడన్నారు. లగచర్లలో రైతులు ప్రాణాలైనా ఇస్తాం తప్ప పంట పొలాలు ఫార్మసిటీ కోసం ఇవ్వమని చెప్పారని, దీంతో మాట మార్చిన రేవంత్ రెడ్డి ఫార్మసిటి కాదు ఇండస్ట్రియల్ పార్క్ పెడతామని మాట మార్చారన్నారు. ఏది పెట్టినా కూడా రైతుల ఇష్టానుసారంగా, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 2000 ఫీట్లతో నాగార్జునసాగర్, శ్రీశైలం రోడ్లు ఉన్నాయి. ఈ రెండు రోడ్లను అనుసంధానం చేసుకుంటూ ఒక లింక్ రోడ్డు కూడా ఉంది. అదనంగా అక్కడ ఇంకో రోడ్ అవసరం లేదు కానీ రేవంత్ రెడ్డి అహంకారంతో మళ్ళీ 330 ఫీట్లతో మరొక రోడ్డుకు శ్రీకారం చుట్టాడన్నారు. అధికారం ఉందని పోలీసులతో రైతులను బెదిరించే ప్రయత్నం చేసిన, భూములు బలవంతంగా గుంజుకునే ప్రయత్నం చేసిన ఖబర్దార్ అని ఈటల రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసి, హైడ్రా, లగిచర్ల ఘటనలపై ఎదురు దెబ్బలు తగిలినా సిగ్గులేకుండా చక్రవర్తి లాగా, నియంతలాగా, శాడిస్ట్ లాగా ఇలాంటివి చేస్తే మంచిది కాదని ఈటల అన్నారు.

# ఆస్ట్రేలియాలో ఘనంగా దీక్షా దివస్

**సిడ్నీ, మెల్బోర్న్‌లో వేడుకలు**



**మహా:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పదిహేను సంవత్సరాల క్రితం కె సి ఆర్ గారు చేపట్టిన 'దీక్ష' ను గుర్తుచేసుకుంటూ ఆస్ట్రేలియాలోనిసిడ్నీ , మెల్బోర్న్ బ్రిస్బేన్ నగరాల్లో బీ ఆర్ ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 'కె సి ఆర్ దీక్ష దివస్' ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ప్రసంగిస్తూ గౌరవ కె సి ఆర్ గారు ఉద్యమ మరియు దీక్ష సమయంలో చేసిన త్యాగాలను,రాష్ట్రం సిద్ధించిన తరువాత తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని, ప్రవేశ పెట్టిన పథకాల గురించి వివరించారు.

సిడ్నీ లో వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గిరి రాపోలు ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమంలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కె సి ఆర్ పోరాట పటిమను, అలుపెరుగని పోరాటాన్ని ,గాంధీజీ మార్గాన్ని అనుసరించి శాంతియుత దీక్ష ద్వారా కేంద్రం దిగివచ్చేలా చేసి తద్వారా తెలంగాణ రాష్ట్ర సిద్ధికి అయన చేసిన కృషిని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తన రాజకీయ పదవులన్నింటిని మరియు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి 'కె సి ఆర్ సచ్చుడో లేదా తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో కె సి ఆర్ గారు చేసిన దీక్ష ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యమాన్ని ముందుండి నడిపి, తద్వారా 60 సంవత్సరాల తెలంగాణ కలను సాకారం చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని తన భుజస్కందాల పై వేసుకొని మునుపెన్నడూ ఎరుగని విధంగా మన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళి న కె సి ఆర్ గారి కృషిని, పట్టుదలను వివరించారు,దేశ చరిత్రలో కె సి ఆర్ గారి పేరు చిరస్థాయిగా నిలిచిపోయిన తరుణంలో ఆస్ట్రేలియా జాతికి కూడా ఆయన త్యాగాన్ని పరిచయం చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఘనం గా నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో రవి శంకర్ దుపాటి, సంగీత దుపాటి , మధు మోహన్ రావు, అజాజ్ మొహమ్మద్, వేణుగోపాల్ దూరిశెట్టి అంజిత్ పైల్ల , అవినాష్అద్దూరి, మస్న అరుణ్ లతో పాటు ప్రవాస తెలంగాణ బిడ్డలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్‌కౌంటర్ బూటకం

**తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయ విచారణ జరిపించాలి**

**మంత్రి పదవికి సీతక్క రాజీనామా చేయాలి ప్రజాసంఘాల నాయకుల డిమాండ్**

**హైదరాబాద్, మహా:** ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలో ఎన్ కౌంటర్ పేరుతో ఏడుగురిని పొట్టనపెట్టుకున్న పోలీసు చర్యను ఇఫ్టూ (శ్రామిక స్పందన) జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు షేక్ షావలి, కర్నాటి మల్లేష్, ఐపీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాడుతున్న ఉద్యమ కారులపై అణిచివేత కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా, ఎన్ కౌంటర్ పేరుతో దుర్మార్గమైన హత్యలకు పాల్పడడం అమానుషం, అప్రజాస్వామిక చర్య అని ఎండగట్టారు. కేంద్రంలో నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో తమ అడవిని, నేలను పరిరక్షిస్తున్న ఆదివాసీ గిరిజన ప్రజలపై మావోయిస్టులు అనే ముద్ర వేసి, మారణ హోమానికి పాల్పడుతున్న క్రమంలో, కేంద్ర ప్రభుత్వానికి ధీటుగా తాము కూడా బడా కార్పొరేట్ సంస్థల దోపిడీకి, వారి ప్రయోజనాలకు నమ్మకమైన ఏజెంట్లమని రుజువు చేసుకోవడానికి చేసిన రాజకీయ హత్యలన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్త శుద్ది ఉన్నా ఎన్ కౌంటర్ లో పాల్గొన్న సంబంధిత పోలీసు, పోలీసు అధికారులను సస్పెండ్ చేసి, హత్యానేరం కేసులు నమోదు చేయాలని, వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# మహా సీఎం పదవి రేసు నుంచి తప్పుకున్న ఏక్ నాథ్ షిండే!

**ఇప్పటికీ తేలని మహా సీఎం పంచాయితీ.. రేపటితో తెరపడే అవకాశం**

**బీజేపీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానన్న షిండే**

**ఫడ్నవీస్‌కు తొలగిన అడ్డంకి!**



**ముంబై, మహా :** మహారాష్ట్ర సీఎం పదవిపై నెలకొన్న ఉత్కంఠ దాదాపు తొలగిపోయినట్టే. తదుపరి ముఖ్యమంత్రి రేసు నుంచి ఏక్ నాథ్ షిండే తప్పుకున్నట్టు ఆయన మాటల ద్వారా అర్థమవుతోంది. బీజేపీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా పాటిస్తానని షిండే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏక్ నాథ్ షిండే ఆపద్ధర్మ సీఎంగా కొనసాగుతున్నారు. ఇటీవల మహాయుతి కూటమి నేతలు కీలక సమావేశం ఏర్పాటు చేయగా, ఉన్నట్టుండి షిండే అనారోగ్యం పేరిట తన స్వగ్రామం వెళ్లిపోవడంతో ఆ సమావేశం జరగలేదు. దాంతో, సీఎం పదవిపై పీట ముడి పడింది. ఆదివారం మీడియాతో మాట్లాడిన షిండే సీఎం పదవి అంశంపై స్పందించారు. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై సోమవారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. "నేను ఇప్పటికే ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట జవదాటనని బేషరతుగా మద్దతు ఇచ్చాను. మహారాష్ట్ర కోసం వారు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలిపాను అని షిండే వెల్లడించారు. అంతేకాదు, షిండే తన అస్వస్థత గురించి తొలిసారిగా మాట్లాడారు. అనారోగ్యం నుంచి కోలుకుంటున్నానని, ప్రస్తుతం తన స్వగ్రామం దరే తాంబ్ లో విశ్రాంతి తీసుకుంటున్నానని చెప్పారు. గత రెండున్నరేళ్లుగా విశ్రాంతి తీసుకోకుండా పని చేశానని, అందుకే ఇప్పుడు అనారోగ్యానికి గురయ్యానని వివరించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. సొంతంగా బీజేపీ 132 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. శివసేన (షిండే) 57 స్థానాలతో సరిపెట్టుకుంది. దాంతో, బీజేపీ నేత, గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర తదుపరి సీఎం రేసులో ముందు నిలిచారు. ఫడ్నవీస్ నే తదుపరి సీఎం చేయాలన్నది బీజేపీ అధిష్ఠానం నిర్ణయంగా తెలుస్తోంది. ఇప్పుడు షిండే వ్యాఖ్యలతో ఫడ్నవీస్ కు ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్టే భావించాలి. ఏదేమైనా రేపటితో ఈ సస్పెన్స్ కు తెరపడనుంది.



## కార్మికుల సంక్షేమం కోసం నిరంతర పోరాటం

**ఐఎన్టీయూసీ**

**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** కొత్తగూడెం ఏరియా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ఐఎన్టీయూసీ యూనియన్ కృషి చేస్తుంది అని కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ అన్నారు. కార్మికుల అనుమతి మేరకే యూనియన్ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టామని, కల్లబొల్లి మాటలు చెప్పి అనేక హామీలు ఇచ్చి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచినటువంటి నాయకులు విమర్శలు మానుకొని కార్మికుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం పని చేయాలన్నారు. ఇటీవల జరిగిన కార్పొరేట్ స్ట్రక్చర్ మీటింగ్ లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ నాయకులు ఏ ఒక్క హక్కును కూడా పూర్తిస్థాయిలో యాజమాన్యాన్ని ఒప్పించకపోవడంపై కార్మికవర్గం అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. పలు అంశాలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంపై కార్మికులు అయోమయంలో ఉన్న పరిస్థితి నెలకొందన్నారు.




సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

# యువతులు, బాలికల్లో అధికంగా హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్లు

**అందుబాటుల్లో లేని చికిత్సలు, ముందస్తు నివారణ చర్యలు**

**యునిసెఫ్ నివేదిక వెల్లడి**



**న్యూయార్క్, మహా :** యువతులు, బాలికల్లో గతేడాది అత్యధికంగా హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్లు సోకడం పట్ల ఐక్యరాజ్య సమితి బాలల నిధి (యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. వారికి చికిత్స అందుబాటులో వుండడం లేదని, పైగా ఈ ఇన్ఫెక్షన్లు సోకకుండా ముందస్తు నివారణ చర్యలు కూడా లేవని హెచ్చరించింది. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యునిసెఫ్ ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో 15 నుండి 19ఏళ్ళ లోపు వయస్సు గల వారిలో 96 వేల మంది బాలికలకు, 41 వేల మంది బాలురకు హెచ్‌ఐవి సోకిందని ఆ నివేదిక పేర్కొంది. అంటే యుక్త వయస్సుకు వచ్చిన బాలికల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చింది. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో, ఈ సంఖ్య ప్రతి పది మందిలో 9గా వుంది. 2023లో దాదాపు 13 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యుఎన్‌ఎయిడ్స్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. వారిలో ఎయిడ్స్ కారణాలతో 6.3 లక్షల మంది మరణించారని తెలిపింది. 2030 కల్లా ప్రజారోగ్యానికి ముప్పుగా వున్న ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యునిసెఫ్ అసోసియేట్ డైరెక్టర్ అనురిత బెయిన్స్ తెలిపారు.

**సాధించాల్సిన లక్ష్యాలు మిగిలేవున్నాయి**

కొత్త హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్లను, ఎయిడ్స్ సంబంధిత మరణాలను తగ్గించడంలో భారత్ కొంత మేరకు పురోగతి సాధించినా సాధించాల్సింది ఇంకా చాలా ఉందని ఎయిడ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. పురోగతి కనిపిస్తున్నప్పటికీ నిధులు, విరాళాలు తగ్గుతున్నందున ఈ కృషిని నిలకడగా కొనసాగించడానికి అవరోధాలు ఎదురవుతున్నాయని పేర్కొంది.

# జనాభా తగ్గితే సమాజం నశిస్తుంది

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్**



**నాగ్ పూర్, మహా :** జనాభా శాస్త్రం ప్రకారం జనాభా పెరుగుదల రేటు 2.1 కంటే తక్కువగా ఉంటే ప్రమాదకరమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. జనాభా తగ్గుదల కొనసాగితే సమాజం నశించిపోతుందని చెప్పారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 'కథలే కుల్ సమ్మేళనం'లో మోహన్ భగవత్ ప్రసంగిస్తూ సమాజాన్ని ఎవరూ అంతమొందించాల్సిన అవసరం లేదని, జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉంటే అదే అంతమైపోతుందని తెలిపారు. అలాగే, భాషలు కూడా కనుమరుగవుతాయని చెప్పారు. ఇండియా జనాభా పాలసీ కూడా ఈ వృద్ధి రేటు 2.1 కన్నా తగ్గకూడదని సూచిస్తోందని తెలిపారు. ఈ రేటు 2 కన్నా ఎక్కువగా, మూడుగా ఉండాలని అన్నారు. ఇది చాలా ముఖ్యమని తెలిపారు. సమాజ మనుగడకు ఈ విధానం అవసరమని చెప్పారు. అలాగే, వర్గాల మధ్య ఉండే జనాభా అసమతుల్యత కూడా భౌగోళిక సరిహద్దులను ప్రభావితం చేస్తుందని, వాటిని విస్మరించరాదని ఆయన అన్నారు. దేశంలోని అన్ని వర్గాల మధ్య ఈ సమతుల్యతను కొనసాగించాల్సిన ప్రాధాన్యం ఉందని తెలిపారు. జనాభా ఎక్కువైతే భారం ఎక్కువగా పడుతుందన్నది నిజమేనని, అయితే, జనాభాను సరిగ్గా ఉపయోగించుకుంటే, అది ఒక వనరు అవుతుందని అన్నారు. మన దేశం 50 ఏళ్ల తర్వాత ఎంతమందికి ఆహారం అందించి ఆదుకోవచ్చో కూడా ఆలోచించాలని చెప్పారు. జనాభా అసమతుల్యత భౌగోళిక సరిహద్దుల్లో మార్పులకు దారి తీస్తుందని తెలిపారు.

EDITORIAL
ఎడిటోరియల్

## ప్రజా ప్రభుత్వంలో
# విద్యా రంగానికి పెద్ద పీట

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు

**ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు**

**ఉపాధ్యాయుల నియామకాలు.. బదిలీలు, పదోన్నతులు**



దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్న ఆచార్య కొఠారి మాటలను ప్రజా ప్రభుత్వం ఆచరణలో చూపుతోంది. నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ఈ క్రమంలోనే విద్యా రంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టింది. స్థానిక అవసరాలే కాకుండా ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను తెలంగాణ బిడ్డలు ఒడిసి పట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖను పర్యవేక్షిస్తూ రాష్ట్ర విద్యా రంగాన్ని సమున్నత స్థాయిలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో కనీవిని ఎరుగుని మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రజా ప్రభుత్వం ఏడాది కాలంలో తీసుకున్న విప్లవాత్మక మార్పులను పరిశీలిస్తే....

- ఈ ఏడాది (202425) బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ.21,292 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇది గతేడాది బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ. ఒక్క ఏడాదిలోనే రూ.2 వేల కోట్లకుపైగా అదనపు కేటాయింపులు ద్వారా విద్యా శాఖపై ఉన్న చిత్తశుద్ధిని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాటిచెప్పారు.
- ప్రతి ఏటా సమస్యలతోనే ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతాయి. ప్రారంభ విఘ్నాలు లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఖర్చు చేసింది. సంవత్సరాల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పాఠశాలల్లో పారిశుద్ధ నిర్వహణ, పచ్చదనం పెంపు..మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించింది. దీంతో పాఠశాలల్లో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావారణం నెలకొంది.
- పాఠశాలలు తెరిచిన రోజే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను అందజేసింది. గతంలో దుస్తులు కుట్టేందుకు రూ.50 ఇచ్చేవారు. దాంతో కూలీ గిట్టుబాటు కాక సరిగా దుస్తులు కుట్టేవారు కాదు. రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.75కు పెంచింది. మహిళలకు ఆర్థికంగా చేయూత లభించింది. గతంలో ఏడాది మధ్యలోనో, ఆఖరులోనో పాఠ్య పుస్తకాలు ఇవ్వడంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందాయి. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయింది.
- ఎటువంటి చికాకులు, ఆందోళనలు లేకుంటేనే ఉపాధ్యాయులు బోధనపై దృష్టిపెట్టగలరు.. దానిని దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రెండు దశాబ్ధాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయి. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 21,419 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. జీవితకాలంలో ఒక్క ప్రమోషన్ లేకుండానే ఉద్యోగ జీవితం ముగిసి పోతుందనే ఆందోళనతో ఉన్న వేలాది మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పదోన్నతులు ఎంతో ఉపశమనం కలిగించాయి. రెట్టించిన ఉత్సాహంతో వారంతా బోధన చేస్తున్నారు. వేల సంఖ్యలో పదోన్నతులు కల్పించినా ఎక్కడా చిన్న పాటి విమర్శకు తావులేకుండా ఆన్‌లైన్‌లో, అత్యంత పారదర్శకంగా వివాద రహితంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేసింది.
- పది పదకొండేళ్లుగా ఒకే చోట పని చేస్తూ ఏళ్లుగా పలువురు ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూశారు. తరగతులకు ఆటంకం కలగకుండా నిబంధనలకు అనుగుణంగా ఉపాధ్యాయుల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. 37,406 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది.
- పాఠశాల భవనాలు ఎంత గొప్పగా ఉన్నా విద్యార్థులు ఎన్ని లక్షల మంది ఉన్నా తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోతే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించింది. వెంటనే ఫలితాలు ప్రకటించి అతి తక్కువ సమయంలోనే ఆ ఉపాధ్యాయుల నియామకాలను పూర్తి చేసింది.
- ప్రభుత్వ బడుల్లో పిల్లలు ఉంటే ఉపాధ్యాయులు ఉండరు... ఉపాధ్యాయులు ఉంటే పిల్లలు ఉండరనే విమర్శలున్నాయి. ఆ సమస్యను పరిష్కరించేందుకు పిల్లలు, టీచర్ల సంఖ్య మధ్య హేతబద్ధతను ప్రభుత్వం పాటించింది. ఒకటి నుంచి 10 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలకు ఒక ఉపాధ్యాయుడు 11 నుంచి 40 మంది విద్యార్థులున్న పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులు, 41 నుంచి 60 వరకు విద్యార్థులున్న పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు 60పైన విద్యార్థులున్న చోట ఆయా పాఠశాలలకు మంజూరైన పోస్టులన్నింటికి ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. దీంతో ప్రతి పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండడంతో తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన సాగుతోంది.
- ఉమ్మడి రాష్ట్రంలో మొదలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో బీఎడ్ పూర్తి చేసిన వారు టెట్ రాయాలంటే ఎప్పుడు నోటిఫికేషన్ వేస్తారో ఎప్పుడు పరీక్ష పెడతారో తెలియని పరిస్థితి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో డీఎస్సీకి ముందు టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. టెట్ రాసిన వారు డీఎస్సీ రాశారు.. ఇక నుంచి ఏటా రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.. దీంతో డీఎడ్, బీఎడ్ చదివే వారు నిశ్చింతగా తమ చదువులపై దృష్టిపెడుతున్నారు.
- పాఠశాల విద్యను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. పర్యవేక్షణ కొరవడడంతో పాఠశాల విద్యా రంగం దెబ్బతిన్నది. బాధ్యతాయుతమైన పర్యవేక్షణతోనే ప్రగతి ఉంటుందని భావించిన ప్రజా ప్రభుత్వం అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించింది.
- సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతిగృహాలను వేర్వేరు చోట్ల.. అద్దె గృహాల్లో...పురాతన భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటన్నింటిని ఒకే చోటకు చేర్చి 20 నుంచి 25 ఎకరాల్లో..నూతన భవనాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని వంద నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాలు తెలంగాణ బిడ్డల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయనున్నాయి. 2024, అక్టోబరు 11న కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ పాఠశాలల్లో అందే విద్యతో భవిష్యత్‌లో తెలంగాణ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో కొలువుదీరనున్నారు.

### నైపుణ్యాలకు పెద్దపీట....

మార్కెట్ అవసరాలకు పొంతన లేని చదువులతో సాధారణ డిగ్రీలతో పాటు ఇంజినీరింగ్ చేసిన వారు సైతం రూ.10 వేల కొలువు సాధించే పరిస్థితి లేకుండా పోయింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. అందుకు అనుగుణంగా పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన రాష్ట్రంలోని 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చివేస్తున్నారు. అలాగే అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రజా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు బోధించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఉండాలని, సిలబస్ దానికి తగినట్లు రూపొందించాలనే ఉద్దేశంతో దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విజయవంతంగా పరిశ్రమలు నడుపుతున్న ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కిల్ యూనివర్సిటీలో భాగస్వాములను చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు పలు దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. కానీ మన దేశంలో మాత్రం యువత ఎక్కువగా ఉంది. ఈ యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నారు.

- దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగం (డ్రగ్స్) బాగా పెరిగిపోయింది. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పరిస్థితి చేయిదాటిపోయింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా తెలంగాణలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగింది. ఈ ముప్పును తెలంగాణ బిడ్డలను రక్షించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తపన పడుతున్నారు. అందుకోసమే పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా, మన బిడ్డలు వాటి బారిన పడకుండా ఉండేందుకు పాఠశాల స్థాయిలో ప్రహరి క్లబ్‌లను ఏర్పాటు చేశారు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రభుత్వ వసతి గృహాల్లో బిడ్డలకు కడుపు నిండా నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం డైట్ ఛార్జీలను పెంచింది. పదేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ఈ ఛార్జీల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.300 కోట్లకుపైగా అదనపు భారం పడుతున్నా ప్రభుత్వం వెనుకంజ వేయలేదు. ప్రభుత్వం డైట్ ఛార్జీల పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాల్లోని 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. డైట్ ఛార్జీలతో పాటు విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

## సీఎంఆర్ఎఫ్‌లో
# కొత్త రికార్డు

### ఏడాదిలోనే రూ.830 కోట్ల సాయం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఔదార్యం**

**1.66 లక్షల కుటుంబాలను ఆదుకున్న ప్రభుత్వం**

**పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు పునర్జన్మ**

**గతంలో సీఎంఆర్ఎఫ్ లో జరిగిన అవకతవకలకు చెక్**




**హైదరాబాద్, మహా:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం, అత్యవసర వైద్య చికిత్స అవసరమైతే సాయం అందించటంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త రికార్డు నెలకొల్పారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే దాదాపు రూ. 830 కోట్లు సీఎంఆర్ఎఫ్ కింద విడుదల చేశారు. రాష్ట్రంలోని 1,66,000 పేద, మధ్య తరగతి కుటుంబాలు సీఎంఆర్ఎఫ్ తో లబ్ధి పొందాయి. 2018 నుంచి 2023 వరకు అయిదేండ్లలో అప్పటి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2400 కోట్ల సాయం అందించింది. అప్పటి ప్రభుత్వం సగటున ఏడాదికి రూ. 480 కోట్లు ఖర్చు పెడితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క ఏడాదిలోనే రూ. 830 కోట్లు సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రజలకు ఆపదలు వచ్చినా, విపత్తులు సంభవించినా ఆదుకునేందుకు నేనున్నానంటూ అభయ హస్తం అందించారు. ఈ ఏడాది ఇచ్చిన రూ. 810 కోట్లలో రూ. 590 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించటం గమనార్హం. ఆరోగ్య శ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం అవసరమైతే ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ సాయం అందిస్తుంది. కొన్ని వ్యాధులకు జిల్లా స్థాయిలో అవసరమైన వైద్య చికిత్స సదుపాయం అందుబాటులో లేక హైదరాబాద్ లోని పెద్ద ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమత లేక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో ముందుగానే సీఎం సహాయ నిధిని ఆశ్రయిస్తారు. అటువంటి సందర్భాల్లో నిమ్స్ తో పాటు ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి, నిలోఫర్, ఈఎన్‌టీ, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చికిత్సలకు అయ్యే అంచనా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. సీఎం సహాయ నిధి నుంచి సంబంధిత ఆసుపత్రికి ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) జారీ చేస్తుంది.

ఈ ఎల్‌వోసీల జారీలోనూ సీఎం తన ఉదారతను చాటుకున్నారు. ఈ ఏడాదిలోనే 13 వేల మందికి రూ. 240 కోట్ల ఎల్‌వోసీలు మంజూరు చేశారు. ఇందులో అత్యధికంగా చిన్న పిల్లలకు అవసరమయ్యే ఆపరేషన్లు, చికిత్సలకు కేటాయించారు. ప్రాణాపాయంలో ఎవరున్నా సరే వైద్య చికిత్స అత్యవసరమని గుర్తించిన ప్రజా ప్రభుత్వం ఎల్ వోసీల జారీని వేగవంతం చేసింది. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే ఎల్ వోసీ ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయవద్దని, ఆదివారంతో పాటు సెలవు దినాల్లో కూడా ఎల్‌వోసీలు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించటం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులకు కూడా అవినీతి చీడ పట్టుకుంది. పేదల పేరిట మెడికల్ బిల్లులు సృష్టించి నిధులను దిగమింగే దందా వెలుగులోకి వచ్చింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసింది. పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను కూడా ఆన్‌లైన్ లోకి తెచ్చింది. గతంలో కొందరు ప్రజాప్రతినిధులు ఆఫీసుల్లో పని చేసిన సిబ్బంది సీఎంఆర్ఎఫ్ చెక్కులు తమ ఖాతాల్లో వేసుకున్నారు. అటువంటి లొసుగులకు అడ్డుకట్ట వేసేందుకు ఏకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులపై లబ్దిదారుల పేర్లతో పాటు వారి బ్యాంక్ ఖాతా నంబర్‌ను రేవంత్ సర్కారు ముద్రిస్తోంది. హాస్పిటల్స్ వెరిఫికేషన్ ప్రక్రియను కఠినతరం చేసి, దొంగ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేయడాన్ని నిరోధించింది. నిజమైన అర్హులకు మాత్రమే సీఎం సహాయ నిధి అందే ఏర్పాట్లు చేసింది.

### ఆ పిల్లలకు పునర్జన్మ

పుట్టుకతోనే ఈఎన్‌టీ (మూగ, చెవుడు) సమస్యలతో పుట్టే పిల్లలకు 6 ఏండ్ల లోపల శస్త్రచికిత్సలు చేయించాల్సి ఉంటుంది. అవసరమైన వినికిడి పరికరాలు అమర్చాల్సి ఉంటుంది. లేకుంటే వారు జీవితాంతం మూగ వారిగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ ఆపరేషన్ల ఖరీదు లక్షల్లో ఉండడంతో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఆపరేషన్లు చేయించుకోలేకపోతున్నారు. అలాంటి పిల్లలు జీవితాంతం చెవులు వినపడక, మాటలు రాని అభాగ్యులుగా ఉంటున్నారని తొలి సమీక్ష సమావేశాల్లోనే వైద్యారోగ్య శాఖ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ముఖ్యమంత్రి తెలంగాణలో భవిష్యత్తు తరాల్లో చెవిటి, మూగ పిల్లలు ఉండకూడదని, అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఎంత ఖర్చయినా ప్రభుత్వమే అలాంటి పిల్లలకు ఛికిత్సలు చేయాలని ఆదేశించారు. ఎల్‌వోసీలు ఇచ్చి అటువంటి పిల్లలను ఆదుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీ ఇచ్చి ఆపరేషన్లు ఇచ్చారు. ఇది తమ పిల్లలకు రేవంతన్న ఇచ్చిన పునర్జన్మ అని పిల్లల తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com |
whatsapp-
7436939999


# మంగళస్నానం అంతరంగం

**మహా:** ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో జోరుగా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెళ్లికి ఎంత ప్రిపరెన్స్ ఇస్తున్నారో మంగళస్నానంకు కూడా అంతే ప్రిపరెన్స్ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. దీంతో చాలామంది మంగళస్నానం గురించి, దాని సిగ్నిఫిక్నెన్సీ ఏంటి అనే వివరాలను తెలుసుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అయితే, పెళ్లి అంటే హిందూ సంప్రదాయ వ్యవస్థలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. పెళ్లిలో భాగంగా రకరకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అందులో ముఖ్యమైనది మంగళస్నానం. పెళ్లికి ముందు వధూవరులకు మంగళస్నానాలు చేయిస్తుంటారు. ఈ సంప్రదాయం ఇప్పటిదికాదు ఎప్పటి నుంచో కొనసాగుతూ వస్తుంది. అయితే, ప్రస్తుత రోజుల్లో మంగళస్నానాన్ని ప్రత్యేక ఆకర్శణగా నిలిచిలే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే చాలామంది ఈ మంగళస్నానం గురించి తెలుసుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మరో రెండు లేదా నాలుగైదు రోజులు లేదా వారం రోజుల్లో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న నూతన వధూవరులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

### ప్రస్తుత రోజుల్లో ఎక్కువ ప్రిపరెన్స్...

మంగళస్నాన సంప్రదాయం నాటి నుంచి కూడా కొనసాగుతున్నా ప్రస్తుత రోజుల్లో మరింత ఆకర్షణగా నిలుస్తుంది. ఇందుకు కారణం చాలానే ఉన్నాయి. అందులో ముఖ్యంగా మంగళస్నాన కార్యక్రమానికి ఎంతో ప్రిపరెన్స్ ఇస్తున్నారు. ఇందుకోసం ఖర్చు కూడా భారీగా పెడుతున్నారు. మొత్తం ఈ కార్యక్రమం స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచేలా పూల డెకరేషన్‌తో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నారు. మంగళస్నానం కోసం ప్రత్యేక పాత్రలను ఉపయోగిస్తున్నారు. పూలతో అలంకరిస్తున్నారు. ఈ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచి ఉండేలా, వాటిని అప్పుడప్పుడు చూసి ఆనందపడేలా వీడియో చిత్రీకరణ, ఫొటోలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి స్నేహితులు, చుట్టాలు హాజరవుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే పెళ్లిరోజు ఏ విధంగా అట్టహాసంగా ఉంటుందో అదే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో మంగళస్నానం కార్యక్రమం సందడి సందడిగా మారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

### మంగళస్నానం ప్రత్యేకత ఇదే..

మంగళ స్నానానికి ముందు గులాబీ పూల రెక్కలుతోపాటు పలు రకాల పూల రెక్కలను ప్రత్యేక పాత్రల్లో ఉన్న శుభ్రమైన నీటిలో వేసి కొంత సమయం వరకు ఉంచుతారు. మరికొంతమంది అందులో పన్నీరు కూడా కలుపుతారు. ఆ తరువాత వధూవరులకు పసుపు, వెన్న, చందనం బాగా మర్థిస్తారు. ఆ తరువాత శెనగపిండితో మృదువుగా రుద్దుకున్నాక వారికి ఆ నీటితో స్నానం చేపిస్తారు. ఇలా పసుపును రాసి మంగళస్నానాలు చేయించడం వల్ల నూతన వధూవరులు పెళ్లి సమయంలో ప్రకాశవంతంగా కనిపిస్తుంటారు. అదేవిధంగా సువాసన కూడా వెదజల్లుతుందంటా. దీంతో పెళ్లిలో వధూవరులు మరింత ప్రకాశవంతంగా కనిపిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారని చెబుతుంటారు.



# ఘనంగా ప్రజా పాలన విజయోత్సవాలు




## ఆదిలాబాద్ లో 2 కే రన్

**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన యేడాది కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో భాగంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అందులో భాగంగా పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో 2 కే రన్ ను చేపట్టగా.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయా క్రీడల్లో రాణించిన క్రీడాకారులను కలెక్టర్ సత్కరించారు. అటు ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...డిసెంబర్ ఒకటి నుండి తొమ్మిదవ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని తెలియచేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలలో ప్రజాపాలనపై వ్యాసరచన పోటీలు సైతం ఉంటాయని పేర్కొనారు. ఎయిడ్స్ డే సందర్భంగా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించేలా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం హెచ్ ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డీవైఎస్ఓ వెంకటేశ్వరు, డీఐఈఓ రవీందర్, డీఎస్పీ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆరట్టు ఉత్సవం

## పట్టణంలో అయ్యప్ప పల్లకి సేవ

**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని పురవీధులు హరిహరసుతుడి నామస్మరణతో మారుమోగాయి. అయ్యప్ప దీక్షదారుల భజన సంకీర్తనలు, కేరళ నుండి ప్రత్యేకంగా తెప్పించి డోలు వాయిద్యాలతో ఆరట్టు ఉత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా సాగింది. భక్తులు భక్తి పారవశ్యంతో ఉత్సవంలో పాల్గొని పునీతులయ్యారు.ఉదయం స్థానిక శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం నుండి ఆరట్టు ఉత్సవం ప్రారంభం కాగా... పట్టణ ప్రధానవీధులగుండా సాగింది. రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, భక్తులు, దీక్షాదారులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కేరళ నుండి ప్రత్యేకంగా తెప్పించిన డోలు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాయిద్యాలకు తగ్గట్లుగా భక్తులు నృత్యాలు చేస్తూ భక్తి భావాన్ని చాటుకున్నారు. ముందుగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకిలో ఉంచి ఊరేగింపు చేపట్టారు. మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి స్వామిజీ దీక్షాపరులతో కలిసి ఉత్సహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అటు దారిపొడవునా భక్తులు పల్లకికి పూజలు చేస్తూ స్వామి వారిని వేడుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన అయ్యప్ప స్వామి దీక్షాధారులు భక్తిపారవశ్యంతో ఉత్సవంలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ ఉత్సవంలో పలువురు రాజకీయ నాయకులు , పట్టణ ప్రముఖులు , పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.





## ప్రజాపాలన విజయోత్సవాలలో వంటల పోటీలు

### విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అడిషనల్ కలెక్టర్

**ఆదిలాబాద్ మహా :** ప్రజాపాలన విజయోత్సవాలు జిల్లాలో విజయవంతంగా సాగుతున్నాయి. పలుశాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్‌పీజీ సిలిండర్లతో మహిళల భద్రత, పాటించాల్సిన జాగ్రత్తలపై కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ముఖ్యఅతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. భద్రతపరమైన అంశాలు పాటిస్తూ రుచికరమైన వంటలు చేసి విజేతలుగా నిలిచినవారికి అతిథులు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వాజీద్ అలీ పాల్గొన్నారు.

# ధ్యానంతో మంచి ఫలితాలు

## పిరమిడ్ స్పిర్చువల్ సొసైటి ఆధ్వర్యంలో అవగాహన



**ఆదిలాబాద్ మహా :** నిత్య జీవితంలో ధ్యానాన్ని భాగం చేసుకునే అనేక ఫలితాలు ఉంటాయని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటి మూమెంట్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమామహేష్ అన్నారు. స్థానిక శ్రీ రామచంద్ర గోపాల కృష్ణమఠంలో సొసైటీ ఆధ్వర్యంలో భిన్నంగా ఆలోచించు అనే అంశంపై అవగాహన కల్పించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు, నిత్యం సాధన, తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ఉమామహేష్ మాట్లాడుతూ... గురువులు, యోగులు ధ్యానం విశిష్టతను తెలియచేశారని, వారు అనుసరించిన విధానాలను పాటిస్తే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ధ్యానాన్ని నిత్యం సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి సుంకరి రమేష్, సభ్యులు నాగుల వెంకట్, కందుల జితేందర్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఇబ్రహీంపట్నం: డిసెంబరు 1 మహా:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అభ్యసించేలా కనీస మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ప్రారంభించి, అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. సభలో ఆయన ప్రసంగిస్తూ తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిని కనబరుస్తూ ముందుకు కొనసాగుతుందని, ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల తోపాటు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు.

### జిల్లా విద్యాశాఖ అధికారితో...

నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎప్పటికప్పుడు ఎంఈఓలతో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిఈవోను కోరారు. ఉపాధ్యాయులతో... ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం హాస్టల్లో స్కూళ్లలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు డైట్ చార్జీలను పెంచిందని మెనూ ప్రకారం అందించాలని ఎప్పటికప్పుడు వసతులను పర్యవేక్షిస్తూ, హాస్టల్ వార్డెన్లు విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యా అధికారి సుసింధర్ రావు, ఆర్డీవో అనంతరెడ్డి, ఎంఈఓ, ఎంపీడీవో వెంకటమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతిచందు, వైస్ చైర్మన్ బర్ల మంద జగదీష్, కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఎద్దుల పాండురంగా రెడ్డి, ఏఎంసి మాజీ చైర్మన్ గురునాథరెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, భూపతిగళ్ల మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, గజ రామకృష్ణ, శ్యామ్ లాల్, సల్మాన్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




# ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడతాం

## జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

### ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం



**ఆదిలాబాద్, మహా :** ప్రజలను చైతన్యపరిచి వారికి వ్యాధి పట్ల పూర్తి అవగాహనా కల్పిస్తేనే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా డీఎంహెచ్ ఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచినవారికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందచేశారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకుగానూ వ్యాధి పట్ల అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగా ఎయిడ్స్ ను పరిగణిస్తామని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను బహిష్కరించడం చట్టరీత్యా నేరమని, వారి పాత్ర లేకుండా కూడా వ్యాధికి గురయ్యే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని వ్యాధి నిర్మూలనకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్ , గజానంద్, సర్ఫరాజ్, ఎయిడ్స్ నియంత్రణ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు వయోపరిమితి పెంచాలి: ఐఎఫ్టీయూ

**మణుగూరు, డిసెంబర్ 1, మహా:** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వయోపరిమితి అరవై ఒక్క ఏళ్లకు పెంచాలని కోరుతూ శుక్రవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓ టు జీఎం డి శ్యామ్ సుందర్ కు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పర్మినెంట్ కార్మికులకు వయోపరిమితిని అరవై ఒక్క ఏళ్లకు పెంచకపోవడంతో ఒక సంవత్సరం సేవలను కోల్పోతున్నారన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఆర్థిక పరిస్థితి సింగరేణి యాజమాన్యానికి తెలియంది కాదని, ఇప్పటివరకు కుటుంబ యాజమానిగా తాము పనిచేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితని, అదేవిధంగా మహిళా కాంట్రాక్ట్ కార్మికుల్లో కూడా ఎక్కువమంది ఒంటరి మహిళలు తమ సంపాదన మీదనే బ్రతుకు బండి ముందుకు సాగాల్సిన పరిస్థితి అని, వయసు పైబడిన కూడా వారి జీవన ప్రమాణాల్లో కాంట్రాక్ట్ కార్మికుల బ్రతుకుల్లో పెద్దగా మార్పు లేదని, పీఎఫ్ కటింగ్ నిబంధనలు అడ్డంకుల నేపథ్యం వయో పరిమితి పేరుపై తాము తమ జీవనోపాధికి కారణమై పని కోల్పోతే యాజమాన్యం పని నుండి తొలగిస్తే ఎలా బ్రతకాలి అనే ప్రశ్న అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులను వేధిస్తోందన్నారు. ఆరోగ్యంగా పనిచేసుకోగలిగే పరిస్థితుల్లో ఉన్న తమను విధుల నుండి తొలగించవద్దని మానవతా దృక్పథంతో పర్మినెంట్ కార్మికులకు ఏ రకంగా అయితే అరవై ఒక్క సంవత్సరం వయోపరిమితి సడలించి సాంకేతిక సమస్యను తొలగించి ఒక సంవత్సరం అదనంగా పనిచేసుకునే అవకాశం కల్పించారో అదేవిధంగా అవకాశ కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో కే గురుమూర్తి, యు శివరామకృష్ణ, ఎం సాంబయ్య, ఎం గ్రూపు సాధు తదితరులు పాల్గొన్నారు.



# నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం



**మణుగూరు, డిసెంబర్ 1, మహా:** నేడు ఉదయం 10 గంటలకు స్థానిక హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు తెలంగాణలో ప్రజాప్రభుత్వ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా "ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో" భాగంగా మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షతన విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మణుగూరు మండల అధ్యక్షులు పీర్నాకి నవీన్ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనగిరి శివ సైదులు, పట్టణ, మండల నాయకులు కూచుపూడి బాబు, తుపూడి శ్రీను, గుడిపూడి కోటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, పాతూరి వెంకన్న, పాల్వంచ రాములు చింతల కృష్ణ, కోర్లకుంట అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.




# అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదానం

**ఆదిలాబాద్ మహా :** అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని నాగదేవత ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు కోటగిరి గోపి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి నెల అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈరోజు అన్నదాతగా నిలిచిన డాక్టర్ వెంకట్ రావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కందుల శేఖర్,నందకిషోర్, శ్రీనివాస్,కిరణ్,వెంకట్,రాజేశ్వర్, రవి తదితరులున్నారు.

# పాడి పశువుల పెంపకానికి చేయూత

## కలెక్టర్ జితేష్ వి.పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 1, మహా:** పాడి పశువుల పెంపకానికి మరింత చేయూతను అందిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయల జాతీయ సేవా పథకంలో భాగంగా పశు వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం అనేది కొంచెం కష్టమైన పని అయినప్పటికీ దాని ద్వారా లాభాలను పొందవచ్చన్నారు. ఒకప్పుడు పాడి రైతులు పశువులను పెంచాలంటే తెల్లవారు జామున నుంచే మేత వేయటం పాలు పితకడం వంటి చాకిరీ ఉండేదని చెప్పారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది పాడి రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వ పరంగా పాడి రైతులకు ఎన్నో రకాల ప్రోత్సాహాలను అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లకు, మేత పెంపకానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారని చెప్పారు. పాడి రైతులు ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలోఅసోసియేట్ డీన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.పురేందర్, పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ కిషోర్, సహాయ సంచాలకులు సత్యప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, యూనివర్సిటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యమే మహాభాగ్యం

## కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సంబరాల సందర్భంగా మొదటి రోజు ఆదివారం కొత్తగూడెంలోని ఇల్లందు క్రాస్ రోడ్ నుంచి రామచంద్ర డిగ్రీ కళాశాల వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన 2కే రన్ లో కలెక్టర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, విద్యార్థులు, వాకర్స్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. ఆటలను ఏదో బహుమతుల కోసమని కాకుండా ఎంతో ఇష్టంతో ఆడుకుంటుంటామని అన్నారు. తనకు బాల్యంలో ఆటల పట్ల అమితాసక్తి ఉండేదని చెప్పారు. ప్రజలకు, యువకులు, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకే ఈ 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు.



# పట్టణాభివృద్ధే నా లక్ష్యం

## మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

**నిర్మల్ మహా :** పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. స్థానిక విద్యానగర్ కాలనీలో ఆదివారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. ఖాళీ ప్లాట్స్, డ్రైనేజీలలో పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ, పిచ్చి మొక్కలు వంటివి శుభ్రం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. త్వరలోనే రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో కౌన్సిలర్ మతిన్ తదితరులున్నారు.



# భద్రాచలంలో ఉప ఎన్నికలు రావడం ఖాయం

## బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి.. తాతా మధుసూదన్




**చర్ల, డిసెంబర్ 1, మహా:** బీఆర్ఎస్ పార్టీ పక్షాన చేరి, పార్టీ నాయకులు, కార్యకర్తల రెక్కల కష్టంతో గెలిచి, నేడు తన స్వార్థ ప్రయోజనాల కోసం నియోజవర్గ ప్రజలను మోసం చేసిన తెల్లం వెంకట్రావుకు తప్పకుండా గుణపాఠం చెప్పాలంటూ ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ అన్నారు. భద్రాచలం నియోజవర్గ ప్రజలు బీఆర్ఎస్ పక్షానే ఉన్నారని కేసీఆర్ కు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తేజంతో నూతన కమిటీలు పనిచేయాలని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన వహిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలన్నారు. మానే రామక్రిష్ణ, దొడ్డి తాతారావు, సోయం రాజారావు, గుడవర్తి నరసింహమూర్తి, ఎన్ ఎన్ రాజు, సీతాపతి రాజు, జోగి రాజు, సింధు తపస్వి ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పర్యాటకులను ఆకర్షించేలా కిన్నెరసాని అభివృద్ధి



**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** పాల్వంచ కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఆ ప్రాంతాన్ని కలియ తిరుగుతూ మరింత అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. టూరిజం, ఫారెస్ట్, కేటీపీఎస్ అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటకులను ఆకర్షించేవిధంగా వెదురు బొంగు లతో కట్టడాలు చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం, ఫారెస్ట్, కేటీపీఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL
సోమవారం, హైదరాబాద్ | 02-12-2024



ANN తెలుగు

# బాబోయ్ ఈ యుద్ధం మాకొద్దు

## గగ్గోలు పెడుతున్న ఉక్రెయిన్ సైన్యం.. సైన్యం నుంచి వేలాది మంది పరారీ


**కీవ్ :** సుమారు మూడేండ్లుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ముగిసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్ సైనికులు చాలామంది 'బాబోయ్ ఈ యుద్ధం మాకొద్దు' అంటూ యుద్ధభూమి నుంచి కాలికి బుద్ధి చెబుతున్నారు. ఒక పక్క కాల్పుల విరమణకు ప్రయత్నాలు సాగుతున్న క్రమంలో గట్టిగా తమ డిమాండ్లపై బేరం ఆడే స్థితిలో ఉక్రెయిన్ లేదని వారు భావిస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 2 లక్షల మంది సైనికులు సైన్యం నుంచి పారిపోయినట్టు అంచనా. కొంతమంది విధులకు గైర్హాజరై పరారవ్వగా, మరికొందరు అనారోగ్య కారణాలతో సెలవులు పెట్టి తిరిగి విధుల్లోకి చేరకపోవడం తో వారి సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. తమకు సరిపడా ఆయుధ సంపత్తి కూడా లేదని వారు అంటున్నారు. దీంతో భూతల దాడిలో ఆ దేశం మరింత బలహీనంగా మారుతున్నది.

**అలా చేస్తే కాల్పుల విరమణకు ఓకే: జెలెన్‌స్కీ**

రష్యాఉక్రెయిన్ యుద్ధ విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. కీవ్ ఆధీనంలో ఉన్న భూ భాగాన్ని నాటో పరిధిలోకి తెస్తే కాల్పుల విరమణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. స్కైన్యూస్‌కు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'వేడిగా సాగుతున్న ఈ యుద్ధం దశను ఆపాలంటే మా నియంత్రణలో ఉన్న ఉక్రెయిన్ భూ భాగాన్ని నాటో పరిధిలోకి తేవాలి. అలా జరిగితేనే రష్యా ఆక్రమించుకున్న మా ప్రాంతాన్ని దౌత్యమార్గంలో సాధించుకోవచ్చు. మేము వేగంగా చేయాల్సిందే అదే' అని పేర్కొన్నారు. అయితే నాటోలోని ఏ దేశం కూడా తమతో ఇలాంటి ప్రతిపాదన తీసుకురాలేదని అన్నారు. దేశంలోని ఒక భూ భాగానికి మాత్రమే రక్షణ ఏర్పాటు చేయడం నాటోకు కూడా కష్టమేనని పేర్కొన్నారు. తమను నాటోలో చేర్చుకోవడం కష్టమేనని, అలాంటి ప్రతిపాదనేదీ కూడా రాలేదన్నారు.

### యుద్ధానికి తెర పడుతుందా?

అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చలకు తాన సిద్ధమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించిన క్రమంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడవచ్చునని భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న శత్రుత్వాన్ని ముగిస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు జెలెన్‌స్కీ కూడా కొత్త ప్రతిపాదనలతో కాల్పుల విరమణకు ఓకే చెప్పడంతో యుద్ధం ముగియవచ్చు.





## ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్ పటేల్..


### ఇండియన్ అమెరికన్‌కు ట్రంప్ కీలక బాధ్యతలు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ వచ్చే నెలలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఈనేపథ్యంలో తన ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తన పరిపాలన టీమ్‌లోకి ఒక్కొక్కరిని తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులు కేటాయించారు. తాజాగా కశ్యప్ పటేల్‌కు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. దేశంలోనే అత్యంత ముఖ్యమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చీఫ్‌గా పటేల్‌ను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

'ఎఫ్‌బీఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ పటేల్ వ్యవహరిస్తునందుకు నేను గర్విస్తున్నా. కాష్ గొప్ప లాయర్, పరిశోధకుడు. దర్యాప్తులో దిట్ట. అమెరికాలో అవినీతి నిర్మూలనకు, న్యాయాన్ని గెలిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్న అమెరికా ఫస్ట్ ఫైటర్. అమెరికా ప్రజల రక్షణలో ఆయన కృషి గొప్పది. ఆయన నియామకంతో ఎఫ్‌బీఐకి పునర్‌వైభవం తీసుకొస్తాం' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫాంలో వెల్లడించారు. కశ్యప్ పూర్వీకులు గుజరాత్ నుంచి వలస వెళ్లారు. అతని తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. కాష్ తండ్రి, ఉగాండలో నియంత ఈదీ ఆమిన్ బెదిరింపుల కారణంగా అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. యూనివర్శిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఓ లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో మియామీ కోర్టుల్లో లాయర్‌గా వివిధ హోదాల్లో సేవలందించారు.

## మనుషులను మెషీన్లతో భర్తీ చేయాలనుకుంటున్నారు

### : ఏఐ పితామహుడు యోషువా




**మాంట్రియల్ :** కొందరు శక్తిమంతులు మనుషులను ఏఐ ద్వారా భర్తీ చేయాలని కోరుకుంటున్నారని కెనడా కంప్యూటర్ శాస్త్రవేత్త, 'ఏఐ పితామహుడి'గా గుర్తింపు పొందిన యోషువా బెంగియో పేర్కొన్నారు. టెక్ దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏఐతో పొంచి ఉన్న ప్రమాదంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'జ్ఞానం శక్తిని ఇస్తుంది. ఆ శక్తిని దుర్వినియోగం చేయాలనుకునే వారు ఉన్నారు.

మనుషులను యంత్రాలు భర్తీ చేయడాన్ని చూసి ఆనందించే వారూ ఉన్నారు.' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తులు గుప్పెడు మందే ఉన్నప్పటికీ, వారు శక్తిమంతులని అన్నారు. వెంటనే సరైన పరిమితులను విధించకపోతే వారు ఈ పనిని చేయగలరని హెచ్చరించారు. ఏఐ రంగంలో పెరుగుతున్న శక్తిని అదుపు చేయడానికి ప్రపంచ నాయకులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని, దీనిపై అంతర్జాతీయ విధానం తీసుకు రావాలని అన్నారు. మానవ మేధస్సు స్థాయిని ఏఐ ఎప్పుడూ సాధిస్తుందో ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు.

## సంభల్ మసీదు వారసత్వ కట్టడం..

### నిర్వహణ మాకు అప్పగించండి: ఆర్కియాలజికల్ సర్వే

**లక్నో:** ఉత్తరప్రదేశ్ సంభల్‌లోని మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదు రక్షిత వారసత్వ కట్టడమని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తెలిపింది. ఈ నేపథ్యంలో రక్షణ కోసం ఆ మసీదుపై నియంత్రణ, నిర్వహణను తమకు అప్పగించాలని కోర్టును కోరింది. శుక్రవారం సంభల్ కోర్టులో ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. అలాగే ఆ మసీదులో సర్వే జరుపాలన్న కోర్టు ఆదేశంపై ప్రతివాదనను సమర్పించింది. ఏఎస్ఐ తరపు న్యాయవాది విష్ణు శర్మ దీని గురించి మీడియాతో మాట్లాడారు. మసీదు సర్వే, స్థల పరిశీలనను మసీదు నిర్వహణ కమిటీ, స్థానికులు అడ్డుకున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా మసీదు మెట్లపై స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు గురించి 2018 జనవరి 19న మసీదు కమిటీపై కేసు నమోదైన సంగతిని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.



కాగా, సంభల్‌లోని మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదును రక్షిత స్మారక చిహ్నంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 1920లో ప్రకటించిందని న్యాయవాది విష్ణు శర్మ తెలిపారు. దీంతో ఆ నిబంధనల మేరకు ఏఎస్ఐ అనుమతి లేకుండా ఆ మసీదులోకి రాకపోకలు, అనధికారిక మార్పులు చట్టవిరుద్ధమని చెప్పారు. ఈ నేపథ్యంలో రక్షిత వారసత్వ కట్టడమైన ఆ మసీదుపై నియంత్రణ, నిర్వహణను ఏఎస్ఐకు అప్పగించాలని కోర్టును కోరినట్లు వెల్లడించారు. ఈ అభ్యర్థనను కోర్టు పరిశీలించే అవకాశమున్నదని అన్నారు.

మరోవైపు గతంలో అక్కడున్న ఆలయాన్ని కూల్చి ఆ మసీదును నిర్మించినట్లు ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. దీని గురించి సర్వే చేయాలని స్థానిక కోర్టు ఆదేశించింది. నవంబర్ 24న సర్వే కోసం వెళ్లిన బృందాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతోపాటు పలు వాహనాలకు నిప్పుపెట్టారు. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతోపాటు బాష్పాయువు ప్రయోగించారు.

కాగా, ఈ హింసాకాండలో నలుగురు వ్యక్తులు మరణించగా పోలీసులతో సహా 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ హింసాకాండపై దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిషన్‌ను సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరోవైపు హింస నేపథ్యంలో ఆ మసీదులో సర్వేను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది.

## కారును ఢీకొట్టిన ట్రక్కు..

### ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం



ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. రాయ్‌పూర్ నుంచి అంబికాపూర్ వెళ్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సుర్గుజా జిల్లా అంబికాపూర్ - బిలాస్‌పూర్ జాతీయ రహదారి 130పై ఉదయపూర్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకున్నది. ప్రమాతం తర్వాత ట్రక్కు డ్రైవర్ తప్పించుకునేందుకు కార్‌ని రివర్స్ చేయగా.. కారు మరింత దెబ్బతింది. మృతులను చంగురభతా రాయ్‌పూర్ వాసులుగా గుర్తించారు. జగదల్‌పూర్‌కు కారులో బయలుదేరగా.. ఉదయపూర్ అదానీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై

## తేనెటీగలు దాడి..

### మరి కొందరికి గాయాలు



**భోపాల్:** కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ సంఘటనలో ఆయనతోపాటు వెంట ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, అధికారులు కూడా గాయపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని శివపురిలో ఈ సంఘటన జరిగింది. శనివారం మాధవ్ నేషనల్ పార్క్‌ను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సందర్శించారు. చాంద్‌పథ సరస్సులోని గుర్రపుడెక్కను తొలగించే డ్రెడ్జింగ్ యంత్రాన్ని ప్రారంభించేందుకు అక్కడకు వచ్చారు.

కాగా, ఇంధన మంత్రి ప్రద్యుమాన్ సింగ్ తోమర్, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి జ్యోతిరాదిత్య సింధియా ఆ యంత్రం వద్దకు చేరుకున్నారు. అయితే తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. దీంతో జ్యోతిరాదిత్య సింధియా, సెక్యూరిటీ సిబ్బంది, పలువురు అధికారులతో సహా 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో డ్రెడ్జింగ్ యంత్రాన్ని ప్రారంభించకుండానే ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## ఇజ్రాయెల్‌పై ఇరాక్ డ్రోన్ల దాడి

**టెల్ అవీవ్ :** ఇజ్రాయెల్ హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నేటికీ దానిని ఉల్లంఘిస్తూ డ్రోన్ల దాడులు కొనసాగుతున్నాయి. ఇరాక్ వైపు నుంచి రెండు డ్రోన్లు తమ దేశంలోకి దూసుకొచ్చాయని, వాటిని కూల్చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. వాటిని ఇరాక్ ప్రయోగించిందని చెప్పడానికి గుర్తు అవి తూర్పు వైపు నుంచి రావడమేనని చెప్పింది. మధ్యధరా సముద్రంలోని నావికాదళం పడవ సాయంతో వాటిని కూల్చేసినట్లు వివరించింది.

## చైనాలో భారీ బంగారు గని..


### విలువ రూ.7 లక్షల కోట్ల పైమాటే

**న్యూఢిల్లీ :** చైనాలో భారీ బంగారు గని బయల్పడింది. ఈ గనిలో దాదాపు 1000 టన్నుల అత్యంత నాణ్యమైన పుత్తడి నిల్వలు ఉన్నాయని, ఈ బంగారం విలువ సుమారు 83 బిలియన్ డాలర్ల (రూ.7,01,885 కోట్లు) మేరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదిగా పరిగణిస్తున్న ఈ పుత్తడి గని దక్షిణాఫ్రికాలోని సౌత్ డీప్ మైన్ (900 టన్నులు) కంటే పెద్దదని చెప్తున్నారు. పింగ్జియాంగ్ కౌంటీలో ఈ భారీ బంగారు గని ఉన్నట్టు హునాన్ ప్రావిన్స్ జియోలాజికల్ బ్యూరో ప్రకటించింది. భూగర్భ శాస్త్రవేత్తలు 2 కిలోమీటర్ల లోతులో 40 గోల్డ్ వెయిన్స్(బంగారం కలిగిన రాతి పొరలు)ను గుర్తించినట్టు వెల్లడించింది. ఈ వెయిన్స్‌లో 300 టన్నుల బంగారం ఉండవచ్చని, 3 కిలోమీటర్ల లోతులో మరిన్ని నిల్వలు ఉంటాయని తెలిసింది.



### భారత జనాభా వృద్ధిరేటుపై ఆందోళన వ్యక్తం చేసిన

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్




భారత దేశ జనాభా వృద్ధి రేటు తగ్గుతుండడంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంతానోత్పత్తి రేటు 2.1 శాతానికి మించి ఉండాలని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశమని.. సమాజంలో సంతానోత్పత్తి రేటు 2.1 శాతం కంటే తక్కువగా ఉంటే.. ఆ సమాజం ఎలాంటి సంక్షోభం అవసరం లేకుండానే భూమిపై మనుగడ అంతరించిపోయే అంచునకు చేరుకుంటుందని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గడం వల్ల అనేక భాషలు, సమాజాలు ఇప్పటికే ఉనికి కోల్పోయాయన్నారు.

1998, 2002లో భారత జనాభా విధానం రూపొందిందని, 2.1 శాతానికి కంటే సంతోనోత్పత్తి పడిపోకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. సమాజం మనుగడకు ఇద్దరు, ముగ్గురి అవసరం ఉందన్న ఆయన.. ఆధునిక జనాభా శాస్త్రం చెబుతున్నది కూడా ఇదే చెబుతుందన్నారు. ఈ సంఖ్య చాలా కీలకమని లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. జనాభా వృద్ధి రేటు తగ్గుముఖం పట్టడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఇదిలా ఉండగా.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వస్తున్నది. 1950 సంవత్సరంలో ఫెర్టిలిటీ రేటు 6.2శాతం కంటే ఎక్కువ ఉండగా.. ప్రస్తుతం అది 2.1శాతానికి తగ్గింది. ఇలా కొనసాగితే 2050 నాటికి సంతానోత్పత్తి రేటు 1.3కి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అత్తవారింట్లో స్నానం చేస్తుండగా.. గీజర్ పేలి నవ వధువు మృతి

**లక్నో:** అత్తవారింట్లోని బాత్‌రూమ్‌లో నవ వధువు స్నానం చేస్తుండగా గీజర్ పేలింది. ఈ సంఘటనలో ఆమె మరణించింది. దీంతో వరుడు, అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భోజిపురాలోని పిపల్సనా చౌదరి గ్రామానికి చెందిన దీపక్ యాదవ్‌కు బులంద్‌షహర్‌లోని కాలే కా నాగ్లా గ్రామానికి చెందిన దామినీతో ఐదు రోజుల కిందట వివాహం జరిగింది. నవ వధువైన ఆమె అత్తవారింటికి వచ్చింది. కాగా, నవంబర్ 27న అత్తవారింట్లోని బాత్‌రూమ్‌లో దామినీ స్నానం చేస్తుండగా గీజర్ పేలింది. విష వాయువుల వల్ల లోపల అచేతనంగా పడిపోయింది. భర్త దీపక్ యాదవ్, అత్తమామలు ఎంత పిలిచినా ఆమె బాత్‌రూమ్ నుంచి బయటకు రాలేదు. మరోవైపు ఆందోళన చెందిన అత్తింటి వారు బాత్‌రూమ్ డోర్ పగులగొట్టారు. లోనికి వెళ్లి చూడగా గీజర్ పేలడాన్ని గమనించారు. అచేతనంగా నేలపై పడి ఉన్న దామినీని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పెళ్లైన ఐదు రోజులకే మరణించిన నవ వధువు దామినీ మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఆమె మరణానికి కారణాలు తెలుస్తాయని పోలీస్ అధికారి తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 02-12-2024 వ్యాపార వార్తలు | BUSINESS NEWS WWW.MAHAADAILY.COM






## టాప్ 10 సంస్థల్లో తొమ్మిదింటి ఎంక్యాప్

# రూ.2.29 లక్షల కోట్లు రైజ్..

### భారీగా ఎల్ఐసీకి బెనిఫిట్..!

గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలోని టాప్10 సంస్థల్లో తొమ్మిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,29,589.86 కోట్లు పెరిగింది. ఇందులో భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) భారీగా లబ్ధి పొందింది. గతవారం మార్కెట్లలో ర్యాలీ నేపథ్యంలో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 685.68 పాయింట్లు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 223.85 పాయింట్లు వృద్ధి చెందాయి.

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.60,656.72 కోట్లు వృద్ధి చెంది రూ.6,23,202.02 కోట్లకు చేరుకున్నది. హెచ్డీఎఫ్సీ బ్యాంకు ఎంక్యాప్ రూ.39,513.97 కోట్లు పుంజుకుని రూ.13,73,932.11 కోట్ల వద్ద నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎంక్యాప్ రూ.35,860.79 కోట్లు పెరిగి రూ.17,48,991.54 కోట్ల వద్ద ముగిసింది.భారతీ ఎయిర్ టెల్ ఎంక్యాప్ రూ.32,657.06 పెరిగి రూ.9,26,725.90 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,482 కోట్ల వృద్ధితో 7,48,775.62 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,858.02 కోట్లు పుంజుకుని రూ.9,17,724.24 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎంక్యాప్ రూ.11,947.67 కోట్లు పెరిగి రూ.5,86,516.72 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎంక్యాప్ రూ.10,058.28 కోట్లు వృద్ధి చెంది రూ.15,46,207.79 కోట్లకు చేరుకున్నది. ఐటీసీ ఎంక్యాప్ రూ.2,555 కోట్లు పెరిగి రూ.5,96,828.28 కోట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18,477.5 కోట్లు వృద్ధి చెంది రూ.7,71,674.33 కోట్లకు చేరింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ టాప్ సంస్థగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగింది. తర్వాత జాబితాలో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.


### వినియోగదారులకు షాక్ ఇచ్చిన


# చమురు కంపెనీలు..

## వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు..

చమురు కంపెనీలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. వాణిజ్య సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.16.50 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1818.50కి పెరిగింది. ధరలు పెరుగడం వరుసగా ఇది ఐదోసారి. అలాగే, ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధరపై రూ.4 వరకు పెంచింది. ఇక గృహ వినియోగ 14.2 కిలోల సిలిండర్ ధరలను మాత్రం పెంచలేదు. గత నెలల ప్రారంభంలో కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ లిండర్ ధరను రూ.62 పెంచగా.. అక్టోబర్ 1న రూ.48.5 పెరిగి రూ.1,740కి చేరింది. ఆగస్ట్ 1న సిలిండర్‌పై రూ.6.5 పెరిగింది. సెప్టెంబర్ 1న రూ.39 పెరిగింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అందరూ ఇబ్బందులుకు గురవుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో సిలిండర్ల ధరల పెంపుదలతో ఎల్పీజీపై ఆధారపడే వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులపై భారీగా ప్రభావం పడే అవకాశం ఉన్నది. కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలో మార్పులు చేయకపోవడం స్వల్పంగా ఊరటనిచ్చినట్లయ్యింది. అంతర్జాతీయ చమురు ధరల ట్రెండ్‌కు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరను ఆదివారం 1.45 శాతం పెంచారు. దేశ రాజధానిలో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ATF) ధర కిలోలీటర్‌కు రూ.1,318.12 పెరిగి రూ.91,856.84కి చేరింది. తాజాగా పెరిగిన ధరలతో కోల్‌కతాలో రూ.1927, ముంబయిలో రూ.1771, చెన్నైలో రూ.1980, హైదరాబాద్‌లో రూ.2066 పలుకుతున్నది. ఇక డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.803 ఉండగా.. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.603కే అందుబాటులో ఉంది. ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50, హైదరాబాద్‌లో రూ.855 వద్ద కొనసాగుతున్నది.






## 15 వరకు ఐటీ రిటర్న్ గడువు

న్యూఢిల్లీ, నవంబర్ 30: గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు మరో 15 రోజులు పెంచింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు. ఈ నిర్ణయంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నులు డిసెంబర్ 15 లోపు దాఖలు చేసుకోవచ్చును. ఆదాయ పన్ను చట్టం, 1961కి లోబడి సెక్షన్ 139(1) కింద ఐటీ రిటర్నుల గడువు తేదీని పెంచినట్లు వెల్లడించింది.

# ఏడు నెలల్లో 50 శాతం పెరిగాయ్..

## పసిడి రుణాలకు ఫుల్ డిమాండ్: ఆర్బీఐ

**ముంబై:** బంగారంపై రుణాలు తీసుకునేవారి సంఖ్య భారీగా పెరిగారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు, అత్యవసర అవసరాలకోసం బంగారమే పరమావధిగా కనిపిస్తున్నది. సామాన్యుడి నుంచి సంపన్నవర్గాల వరకు బంగారం ఉంటేచాలు బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలకాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా ఈ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను కూడా నెలకొల్పాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన ఏడు నెలల్లో(ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతం మేర పెరిగాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ 18, 2024 నాటికి పసిడి రుణాలు రూ.1,54,282 కోట్లుగా ఉన్నాయి. మార్చి 2024 నాటికి మొత్తం బంగారం రుణాలు రూ.1,02,562 కోట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైనదాంతో పోలిస్తే గోల్డ్ లోన్లు 56 శాతం అధికమయ్యాయి. గడిచిన ఏడు నెలల్లో బంగారం రుణాలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయని, ఇందుకు ప్రధాన కారణం ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు అన్‌సెక్యూర్డ్ లోన్ల కంటే సెక్యూర్డ్ లోన్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే పెరిగాయని బ్యాంకర్ వెల్లడించారు. అలాగే బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోవడంతో రుణగ్రహీతలు బంగారాన్ని తాకట్టుపెట్టుకొని ఇతర రుణాలను తీర్చుకుంటున్నారని తెలిపారు. పసిడి రుణాల పాలసీలు, విధానాల్లో లోపాలు ఉంటే వచ్చే మూడు నెలల్లో సరిదిద్దుకోవాలని గత నెలలో రిజర్వు బ్యాంక్ అన్ని బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలకు సూచించింది.



## క్రీడా వార్తలు SPORTS NEWS



# హైబ్రిడ్‌కు ఓకే కానీ..

## ఐసీసీ అల్టిమేటంతో వెనక్కి తగ్గిన పీసీబీ

### ఐసీసీకి పీసీబీ పలు డిమాండ్లు



**దుబాయ్/కరాచీ:** చాంపియన్స్ ట్రోఫీ(2025) నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. హైబ్రిడ్ మోడల్ విషయంలో ఐసీసీ అల్టిమేటంకు ఒకింత వెనుకకు తగ్గిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) పలు డిమాండ్లు ముందు పెట్టింది. ఓవైపు హైబ్రిడ్ పద్ధతికి ఓకే అంటూనే వచ్చే మూడేండ్లు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలకు ఇదే పద్ధతి వర్తింపజేయాలని షరతులు పెట్టింది. శనివారం చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై పీసీబీ చీఫ్ మోహిసిన్ నక్వీ స్పందిస్తూ 'టోర్నీ నిర్వహణపై నేను అతిగా మాట్లాడాను. అలా చేస్తే పరిస్థితులు ఇంకా క్లిష్టంగా మారుతాయి. మేము మా ప్రతిపాదనలు ఐసీసీ ముందు ఉంచాం, భారత్ కూడా వారి సిఫార్సులు చెప్పింది. ఏ నిర్ణయం తీసుకున్నా..అది అందరికీ సమానంగా ఉండాలి. అంతిమంగా క్రికెట్ గెలువాలన్నదే మా తపన అదే సమయ ంలో పాకిస్థాన్ ఆత్మగౌరవం కూడా ముఖ్యమే' అని అన్నాడు. దీనికి తోడు వార్షిక ఆదాయ వాటాలను కూ డా ఐసీసీ పెంచాలని పీసీబీ డిమాండ్ చేస్తున్నది.

# ఐసీసీ అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు..

## అతిపిన్న వయస్కుడిగా రికార్డు..



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) చైర్మన్‌గా జై షా బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని ఐసీసీ ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అతిపిన్న వయస్కుడు ఆయనే. గతంలో ఆయన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (BCCI) కార్యదర్శిగా పని చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్‌క్లే పని చేసిన విషయం తెలిసిందే. ఆయన నాలుగు సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా కొనసాగారు. జై షా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఐసీసీ అధ్యక్షుడిగా నియామకమైన భారతీయుడు జై షా. ఇంతకు ముందు దివంగత జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, శశాంక్ మనోహర్, పారిశ్రామికవేత్త ఎన్ శ్రీనివాసన్ ఐసీసీ అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం జై షా ముందు సవాళ్లు ఉన్నాయి. దాయాది దేశం పాక్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఈ ట్రోఫీ కోసం జట్టును పాక్‌కు పంపేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఐసీసీ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తారు ? హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఆ దేశాన్ని ఒప్పిందం సవాల్‌గా మారనున్నది.

కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా తనయుడు జై షా క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా తన కెరీర్‌ను 2009లో ప్రారంభించింది. అహ్మదాబాద్‌లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ క్రికెట్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పని చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 2013లో గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (GCA) జాయింట్ సెక్రటరీ నియామకమయ్యారు. ఆ తర్వాత 2015లో బీసీసీఐ బోర్డ్ ఫైనాన్స్, మార్కెటింగ్ కమిటీ సభ్యుడిగా చేరారు. 2019 అక్టోబర్‌లో బీసీసీఐ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించారు. అతిపిన్న వయసులో బీసీసీఐ సెక్రెటరీ బాధ్యతలు తీసుకున్నారు. బీసీసీఐ కార్యదర్శి పదవీకాలంలో సౌరవ్ గంగూలీతో పని చేశారు. ఆ తర్వాత రోజర్ బిన్నీతో కలిసి పని చేశారు. ప్రస్తుతం బీసీసీఐ అధ్యక్షుడిగా బిన్నీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2022లో ఐదేళ్లపాటు ఐపీఎల్ మీడియా హక్కులను రూ.48,390 కోట్లకు విక్రయించేలా జై షా కృషి చేశారు. ప్రతి మ్యాచ్ విలువ ఆధారంగా.. ఎన్ఎఫ్ఎల్ తర్వాత ఐపీఎల్ రెండో అత్యంత విలువైన క్రీడగా తీర్చిదిద్దారు. ఇక 2021లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ ఏడాది జనవరిలో మరోసారి ఆయనకే ఏసీసీ బాధ్యతలు అప్పగించారు. నవంబర్ 2022లో ఐసీసీ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ సబ్‌కమిటీకి చీఫ్‌గా నియామకమయ్యారు. కామన్వెల్త్ గేమ్స్ తదితర ఈవెంట్లలో క్రికెట్‌ని చేర్చడంలో కీలకపాత్ర పోషించారు.

# సయ్యద్ మోడీ టోర్నీ ఫైనల్లో సింధు..

## టైటిల్ పోరుకు లక్ష్యసేన్

లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్-300 టోర్నీలో భారత షట్లర్ల హవా కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా గాయాలకు తోడు ఫామ్‌లేమితో సతమతమవుతున్న స్టార్ షట్లర్ పీవీ సింధు మళ్లీ గాడిలో పడింది. టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లి సత్తాచాటింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్‌సీడ్ సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన ఉన్నతి హుడాపై అలవోక విజయం సాధించింది. 36 నిమిషాల్లో ముగిసిన పోరులో సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తన అనుభవాన్నంత ఉపయోగిస్తూ డ్రాప్‌షాట్లు, నెట్‌గేమ్‌తో ఆకట్టుకుంది. మరోవైపు ఇప్పుడిప్పుడే కెరీర్‌లో నిలదొక్కుకుంటున్న ఉన్నతి..ఒత్తిడికిలోనై అనవసరపు షాట్లతో ప్రత్యర్థికి పాయింట్లు సమర్పించుకుంది. తొలి గేమ్‌లో సింధు 5-3తో ముందంజ వేసింది. పుంజుకునేందుకు ప్రయత్నించే క్రమంలో ఉన్నతి షాట్లను సరైన రీతిలో ఆడలేకపోయింది. దీంతో సీనియర్ షట్లర్ ఆధిక్యం 11-8కు చేరుకుంది. ఇదే అదనుగా విజృంభించిన సింధు..తన ట్రేడ్‌మార్క్ బేస్‌లైన్ స్మాషెస్ జోలికి పోకుండానే ఉన్నతి పనిపట్టింది. రెండో గేమ్‌లోనూ అదే దూకుడు కొనసాగించిన ఈ తెలుగు షట్లర్ వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాకు చెందిన యవులు యుతో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత మాట్లాడుతూ 'ఈ రోజు నా ప్రదర్శనపై చాలా సంతోషంగా ఉన్నాను. ఆది నుంచే ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చాను. బేసిక్స్‌కు కట్టుబడి ఉంటూ మ్యాచ్ ఆడాను. మొత్తంగా ఈ విజయం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. ప్లేయర్ల కెరీర్‌లో ఒడిదొడుకులు సహజం. వయసును బట్టి మనలో ఫిట్‌నెస్ స్థాయి మారుతూ ఉంటుంది. అందుకు తగ్గట్లు మార్పులు చేసుకోవాలి' అని అంది.

### టైటిల్ పోరుకు లక్ష్యసేన్

పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీస్‌లో లక్ష్యసేన్ 21-8, 21-14తో షోగో ఓగావ(జపాన్)పై గెలిచాడు. ఫైనల్లో జపాన్ షట్లర జియా హెంగ్‌జాసన్‌తో తలపడుతాడు. మిగతా మ్యాచ్‌ల్లో మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్యాస్ట్రో జోడీ 21-16, 21-15తో చైనా ద్వయం జౌ జీ, యాంగ్ జిపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొనప్ప, తనీషా క్యాస్ట్రో 21-14, 16-21, 13-21తో చైనా జంట బావో లీ జింగ్, లి క్విన్‌పై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్‌లో భారత జోడీ పృథ్వీ, సాయి ప్రతీక్ 21-17, 17-21, 21-16తో ఇషాన్ భట్నాగర్, శంకర్ ప్రసాద్‌పై గెలిచి టైటిల్ పోరులో నిలిచింది. మరో మహిళల డబుల్స్ సెమీస్‌లో గాయత్రీ గోపీచంద్, త్రిసా జాలీ జోడీ 18-21, 18-21, 10-21తో బెన్యప, నుత్కకరన్ ద్వయం చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## లాన్ టెన్నిస్‌లో ఐజీపీ టీమ్‌కు స్వర్ణం

**హైదరాబాద్ :** పోలీస్‌శాఖ, పారామిలటరీ బలగాల సిబ్బందికి సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 50 ప్లస్ కేటగిరీలో నిర్వహించిన ఆల్ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో మల్టీజోన్1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని టీమ్ స్వర్ణం సాధించింది. శనివారం బెంగళూరులో జరిగిన ఫైనల్లో చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్ జోడీ 96 స్కోర్ తేడాతో, ఏపీకి చెందిన డీఎస్పీలు రామ్‌కుమార్, సత్యనారాయణ ద్వయంపై విజయం సాధించింది.







# ఇండియాలో అత్యధిక పన్నులు చెల్లించే స్టార్ హీరోలు వీరే..
# టాలీవుడ్ నుంచి టాప్ ఎవరంటే?

ఫార్చ్యూన్ ఇండియా భారతదేశంలో అత్యధిక పన్ను చెల్లించే సినీ ప్రముఖుల జాబితాను ప్రకటించింది. తమ నటనతో ప్రేక్షకుల హృదయాలను శాసించడమే కాకుండా, సకాలంలో పన్నులు చెల్లించడంలో కూడా ముందుండే నటులు భారతీయ సినిమాలో ఎందరో ఉన్నారు. ఇటీవల, ఫార్చ్యూన్ ఇండియా భారతదేశంలో అత్యధికంగా చెల్లించే బాలీవుడ్ ప్రముఖుల జాబితాను ప్రకటించింది మరియు ఇందులో షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ వంటి చాలా మంది స్టార్స్ ఉన్నారు. ఫార్చ్యూన్ ఇండియా జాబితాలో 202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాదాపు రూ. 92 కోట్ల పన్నులు చెల్లించిన షారుక్ ఖాన్ అగ్రస్థానంలో ఉన్నారు. ఆ తర్వాత తలపతి విజయ్ సుమారు రూ. 80 కోట్లు పన్నులు చెల్లించారు. ఫార్చ్యూన్ ఇండియా జాబితాలో దాదాపు రూ.75 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించిన సల్మాన్ ఖాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇది కాకుండా, అమితాబ్ బచ్చన్, అజయ్ దేవగన్, రణబీర్ కపూర్, హృతిక్ రోషన్ తదితర స్టార్ హీరోలు కూడా ఈ జాబితాలో ఉన్నారు.

### అత్యధిక పన్ను చెల్లించిన సినీతారలు వీరే

షారూఖ్ ఖాన్ - 92 కోట్లు
దళపతి విజయ్ - 80 కోట్లు
సల్మాన్ ఖాన్ - 75 కోట్లు
అమితాబ్ బచ్చన్ - 71 కోట్లు
అజయ్ దేవగన్ - 42 కోట్లు
రణబీర్ కపూర్ - 36 కోట్లు
హృతిక్ రోషన్ - 28 కోట్లు
కపిల్ శర్మ - 26 కోట్లు
కరీనా కపూర్ - 20 కోట్లు
షాహిద్ కపూర్ - 14 కోట్లు
మోహన్‌లాల్ - 14 కోట్లు
అల్లు అర్జున్ - 14 కోట్లు
కియారా అద్వానీ - 12 కోట్లు
కత్రినా కైఫ్ - 11 కోట్లు

### అల్లు అర్జున్ టాప్..

తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అల్లు అర్జున్ ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నారు. ఈ ఐకాన్ స్టార్ 202324లో ఏకంగా రూ. 14 కోట్ల మేర అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించినట్లు ఫార్చ్యూన్ ఇండియా నివేదిక తెలిపింది. టాప్ 20 జాబితాలో అల్లు అర్జున్ 16వ స్థానం చేజిక్కించుకున్నారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటి అంటే ప్రభాస్, మహేష్ బాబు వంటి హీరోల పేర్లు టాప్ 20 జాబితాలో లేకపోవడం.

### హీరోయిన్లు వీళ్లే..

ఫార్చ్యూన్ ఇండియా ప్రకారం, కరీనా కపూర్ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 20 కోట్ల పన్ను చెల్లించి జాబితాలో తొమ్మిదో స్థానంలో నిలిచింది.ఇక కియారా అద్వానీ 12 కోట్లతో 14వ స్థానంలో ఉండగా, కత్రినా కైఫ్ 11 కోట్లు చెల్లించి టాప్ 20 లో స్థానం సంపాదించింది.

# అది చూసి ఎంతో బాధపడ్డాను..
## నేను చెప్పినా ఎవరూ అర్థం చేసుకోలేదు..
## సాయి పల్లవి ఎమోషనల్..

దక్షిణాది సినీప్రియులకు అత్యంత ఇష్టమైన హీరోయిన్ సాయి పల్లవి. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతిఒక్కరూ సమానంగా ఇష్టపడే అతికొద్దిమంది నటీమణులలో సాయిపల్లవి ఒకరు. తెలుగు, తమిళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి.. అద్భుతమైన నటనతో మెప్పించింది. అందం, అభినయంతో అడియన్స్ హృదయాల్లో స్థానం సంపాదించుకుంది. ఇటీవలే అమరన్ సినిమాతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. శివకార్తికేయన్ హీరోగా డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ మూవీ ఇప్పటికీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతుంది. మరోవైపు రామాయణం సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టబోతుంది. అయితే సాయి పల్లవి ప్రతి సినిమా విడుదలకు ముందు ఏదోక విషయంలో ఆమె పై ట్రోల్స్ జరుగుతుంటాయి. గతంలో ఆమె మాట్లాడిన మాటలను మళ్లీ షేర్ చేస్తూ ఆమె పై విమర్శలు చేస్తుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి తన మాటలు ఎందుకు నెట్టింట ట్రోల్స్ చేస్తుంటారనే విషయంపై స్పందించింది. కొన్నేళ్ల క్రితం తనను మలయాళీ అని పిలిచినందుకు ఓ రిపోర్టర్‌పై ఆమె సీరియస్ అయినట్లు వార్తలు వచ్చాయని.. అవి చూసి తాను ఎంతో బాధపడ్డానని వెల్లడించింది. కేరళ నుంచి తనకు లభిస్తున్న ప్రేమ, ఆదరణ చాలా పెద్దదని చెబుతూ.. 'ప్రేమమ్' సినిమా నన్ను ఈరోజు చూస్తున్న వ్యక్తిగా మార్చిందని చెప్పుకొచ్చింది. గలాటా ప్లస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సాయి పల్లవి మాట్లాడుతూ.. "మూడు నాలుగేళ్ల క్రితం నేను మీడియాతో మాట్లాడుతున్నాను. అప్పుడు ప్రెస్ మీట్ లేదు. ఇంకా కెమెరాలను ఆన్ చేయలేదు. మలయాళ నటీనటులందరూ ఇంత బాగా తెలుగు ఎలా మాట్లాడుతారని ఓ విలేఖరి నన్ను అడిగాడు. నేను మలయాళీని కాదు, తమిళనాడు నుంచి వచ్చాను అని చెప్పాను. ఆ తర్వాత ఏడాది లేదా రెండు సంవత్సరాల తర్వాత ఓ ప్రముఖ దినపత్రిక 'సాయి పల్లవి తనని మలయాళీ అని పిలిచినందుకు రిపోర్టర్‌పై సీరియస్ అయ్యింది అంటూ పెద్ద హెడ్డింగ్ ఇచ్చింది. అది చూసినప్పుడు నాకు చాలా బాధ కలిగింది. నేను కేరళ కదా.. తమిళనాడు నుంచి వచ్చానని మాత్రమే చెప్పాను.



సాధారణంగా సినీతారల ఉపయోగించిన వస్తువులు, దుస్తులు వేలం వేస్తుంటారు. అయితే వాటిని లక్షల్లో, కోట్లలో కొనుగోలు చేస్తుంటారు. గతంలో నిషా కళ్ల చిన్నది సిల్క్ స్మిత సగం తిన్న ఆపిల్ పండును సైతం వేలం వేశారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ ఉర్ఫీ జావేద్ తన కొత్త డ్రెస్సును అమ్ముతాను అంటూ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బిగ్ బాస్, సోషల్ మీడియాతోపాటు, పలు టెలివిజన్ షోలలో పాపులారిటీని సొంతం చేసుకున్న ఉర్ఫీ జావేద్.. బోల్డ్ గా కనిపిస్తూ.. కొత్త కొత్త వెరైటీ డ్రెస్సులతో హాట్ హాట్ ఫోటోలతో నెట్టింట రచ్చ చేస్తుంటుంది. అయితే ఈ అమ్మడు క్రేజీ ఫోటోషూట్స్, డ్రెస్సింగ్ పై నిత్యం చాలా మంది విమర్శలు గుప్పిస్తుంటారు. కానీ ఓ డ్రెస్సు విషయంలో మాత్రం ఈ బ్యూటీ పై ప్రశంసలు

# నా డ్రెస్సు అమ్ముతున్నాను
## ధర రూ.3 కోట్ల 66 లక్షలు.. ఉర్ఫీ జావేద్ పోస్ట్..

కురిపించారు. అదే బ్లాక్ అండ్ గ్రీన్ బట్టర్ ఫ్లై డ్రెస్. బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ టైప్ డ్రెస్ ను వేసుకుని ఉర్ఫీ గతంలో ఫోటోస్ దిగిన సంగతి తెలిసిందే. ఆ డ్రెస్ పై పువ్వులు, ఆకులతోపాటు బట్టర్ ఫ్లైస్ కనిపిస్తూ చూడడానికి ఎంతో అందంగా కనిపించింది. ఇప్పుడు అదే డ్రెస్సును అమ్ముతున్నట్లు ప్రకటించింది ఉర్ఫీ. ఆ డ్రెస్ ధర కేవలం రూ.3 కోట్ల 66 లక్షల 99 వేలు మాత్రమే. ఎవరికైనా ఇంట్రెస్ట్ ఉంటే నాకు మెసేజ్ చేయండి అంటూ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఉర్ఫీ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఉర్ఫీ పెట్టిన పోస్ట్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ఒక్క డ్రెస్ ఏకంగా రూ.3 కోట్లకు పైన ధర ఉంటుందా ? అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇక ఈ విషయంలో మాత్రం కొందరు ఉర్ఫీని ట్రోల్ చేస్తున్నారు. అయితే ఉర్ఫీ మాత్రం తన డ్రెస్ అమ్మడానికి గల రీజన్ మాత్రం వెల్లడించలేదు.



# చీరకట్టులో కవ్విస్తోన్న శ్రీవల్లి..

2016లో రష్మిక కిరిక్ పార్టీ సినిమాతో కన్నడ సినీరంగంలోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. అంతకు ముందు ఆమెకు కొన్ని సినిమాల్లో సైడ్ రోల్స్ ఆఫర్స్ వచ్చినప్పటికీ వాటిని రిజెక్ట్ చేసిందట. తన టాలెంట్‌కు తగ్గట్టు అవకాశం వస్తేనే నటించాలని రష్మిక నిర్ణయించుకుంది. మొదటి సినిమాతో ఫుల్ పాపులారిటీని సొంతం చేసుకుంది. ఛలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. గీతా గోవిందం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ మూవీ తర్వాత తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ నేషనల్ క్రష్ ట్యాగ్ సొంతం చేసుకుంది. దీంతో ఈ బ్యూటీకి అటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ వచ్చాయి. డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన పుష్ప మూవీతో పాన్ ఇండియా హీరోయిన్ గా క్రేజ్ సొంతం చేసుకుంది. దీంతో అటు హిందీలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. యానిమల్ సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు అల్లు అర్జున్ సరసన పుష్ప 2 మూవీతో మరోసారి పాన్ ఇండియా అడియన్స్ ముందుకు రాబోతుంది. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. దేశంలోని పలు నగరాల్లో ఈ మూవీ ప్రమోషన్స్ జరుగుతున్నాయి.



# అమ్మ బాబోయ్..!
## ఈ టాలీవుడ్ విలన్ భార్య ఆస్తి ఏకంగా రూ.400 కోట్లు..

హీరోయిన్స్ సినిమాలతో పాటు పలు బిజినెస్ లాల్లోనూ భారీగా పెట్టుబడులు పెట్టి సంపాదిస్తున్నారు. ఒక వైపు కోట్లల్లో రెమ్యునరేషన్ తీసుకుంటూనే.. మరో వైపు బిజినెస్ లలో లాభాలు అందుకుంటున్నారు. తాజాగా ఓ హీరోయిన్ వందల కోట్లు సంపాధించి అందరిని షాక్ కు గురి చేసింది. మనదగ్గర హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ తీసుకునే హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తాజాగా ఓ టాలీవుడ్ విలన్ భార్య ఆస్తిపాస్తులు చూస్తే కళ్ళు తిరగాల్సిందే. ఆమె ఆస్తి కొన్ని వందల కోట్లు, హీరోయిన్ గాను భారీ సంపాదించింది ఈ ముద్దుగుమ్మ. ఇంతకూ పై ఫొటోలో ఉన్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా.? ఆమె భర్త కూడా ప్రముఖ నటుడే.. విలన్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. రీసెంట్ గానే భారీ హిట్ అందుకున్నాడు. ఆయన నటించిన సినిమా దాదాపు రూ. 600కోట్లు వసూల్ చేసింది. పై ఫొటోలో కనిపిస్తున్న నటి ఎవరో కాదు స్టార్ హీరోయిన్ కరీనా కపూర్. ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ లో తోపు హీరోయిన్. అక్కడ ఆమె ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. ఇక ఈ బ్యూటీ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ ను ప్రేమించి పెళ్లాడింది. సైఫ్ టాలీవుడ్ లో విలన్ గా సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమాలో రావణుడిగా చేశాడు. రీసెంట్ గా దేవర సినిమాలో విలన్ గా చేసి మెప్పించాడు. ఇక కరీనా ఆస్తి విలువ రూ. 485 కోట్లు, ఆమె భర్త ఆస్తి విలువ రూ. 1,685 కోట్లు





# కాశీలో పుట్టినరోజు జరుపుకున్న రాశీ ఖన్నా..
## పేరెంట్స్‌తో కలిసి ప్రత్యేక పూజలు..

గత కొన్ని రోజులుగా టాలీవుడ్ లో పెద్దగా కనిపించిన రాశీ ఖన్నా ప్రస్తుతం బాలీవుడ్ లో బిజీ బిజీగా ఉంటోంది. సినిమాలు, వెబ్ సిరీసుల్లో నటిస్తూ అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉంటే శనివారం (నవంబర్ 30) రాశీ ఖన్నా పుట్టిన రోజు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్ల నుంచి ఆమెకు బర్త్ డే విషెస్ వెల్లు వెత్తాయి. ఇదిలా ఉంటే రాశీ ఖన్నా తన బర్త్ డే ను పేరెంట్స్ తో కలిసి పవిత్ర కాశీలో జరుపుకుంది. సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు చేసింది. ఇక కాశీలో హోమం కూడా జరిపించింది రాశీ ఖన్నా. ఇందుకు సంబంధించిన వీడియోలను, ఫోటోలను షేర్ చెయ్యగా అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. అంతేకాదు కాశీలోని స్కూల్ పిల్లలతో కూడా తన బర్త్ డే జరుపుకుంది. అక్కడి పిల్లలతో కేక్ కట్ చేసి వారితో సరదాగా గడిపింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# కమీషన్ల కోసమేనా.. కట్టుబడులు?

## నాణ్యతలేని నిర్మాణాలు.. ప్రజాధనం వృథానేనా ..?

**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలు విస్తృతంగా పనులు కొనసాగుతున్నాయి కానీ, జరిగే పనులలో నాణ్యత లోపాలు కనబడుతున్నా అధికారులు మాత్రం తుతు మంత్రంగానే పర్యవేక్షిస్తున్నారని, నాణ్యతలేని కట్టుబడులకు బిల్లులు ఎలా మంజూరు చేస్తారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎవరి స్వార్థం కోసమో ఈ కాలువల పనులు రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అష్ట వంకరలు తిరుగుతూ అడ్డదిడ్డంగా కాలువలు నిర్మిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత రోడ్లను పూర్తిగా తొలగించకుండా పైపై మెరుగులు దిద్దుతూ పూర్తిస్థాయిలో బిల్లులు పొందుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా నిర్మించినటువంటి రోడ్లు, కాలువలు ఎన్ని రోజులు ఉంటాయని స్థానికులలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక కాలువను నిర్మించడానికి మొదటగా అధికారులు పర్యవేక్షణ చేసి దానికి సంబంధిత మెటీరియల్ పై కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ జరిపి దగ్గరుండి సంబంధిత అధికారులు పనులు జరిపించేవారు కానీ, ఇప్పుడు అలాంటి అధికారులు లేకపోవడం వల్లనే పనులలో కూడా నాణ్యత లోపం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు గుమస్తాలతోనే పూర్తి నిర్మాణాలు చేపడుతున్నారని, బిల్లుల సమయంలో కూడా వారి ద్వారానే బిల్లులు కూడా మంజూరు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మంజూరైన నిధులను వృథా చేస్తూ కాంట్రాక్టర్లు జేబులో నింపుకుంటూ ప్రజాధనం వృథా చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీలలో జరుగుతున్నటువంటి పనులను పరిశీలించి నాణ్యత లోపాలు గుర్తించి కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకొని నాణ్యత తో కూడినటువంటి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు పలు రాజకీయ సంఘాలు కోరుకుంటున్నారు.





## కార్మికుల సంక్షేమం కోసం నిరంతర పోరాటం



### ఐఎన్టీయూసీ

**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** కొత్తగూడెం ఏరియా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ఐఎన్టీయూసీ యూనియన్ కృషి చేస్తుంది అని కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ అన్నారు. కార్మికుల అనుమతి మేరకే యూనియన్ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టామని, కల్లబొల్లి మాటలు చెప్పి అనేక హామీలు ఇచ్చి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచినటువంటి నాయకులు విమర్శలు మానుకొని కార్మికుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన కార్పొరేట్ స్ట్రక్చర్ మీటింగ్ లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ నాయకులు ఏ ఒక్క హక్కును కూడా పూర్తిస్థాయిలో యాజమాన్యాన్ని ఒప్పించకపోవడంపై కార్మికవర్గం అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. పలు అంశాలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంపై కార్మికులు అయోమయంలో ఉన్న పరిస్థితి నెలకొందన్నారు.

## విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, డిసెంబర్ 1, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ గురుకుల గృహాల్లో వరస ఫుడ్ పాయిజన్ ఘటనపై పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ నాయకులను ఘాటుగా విమర్శించారు. ఆదివారం మణుగూరు ప్రజా భవన్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్య, వైద్యా, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందన్నారు. గురుకుల సంక్షేమ హాస్టల్లో ఆహారం కల్తీ కావడం వెనక బీఆర్ఎస్ పార్టీ రాజకీయ కుట్ర దాగి ఉందని, రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీర్నాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేష్, కూచిపూడి బాబు, శివ, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్ నిర్మాణంలో సీపీఐ కృషి ఎనలేనిది



### బొల్లోజు అయోధ్య

**మణుగూరు, డిసెంబర్ 1, మహా:** భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం సీపీఐ పార్టీ ఎనలేని కృషి చేసిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య అన్నారు. ఆదివారం భీమరాజు కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయోధ్య హాజరై మాట్లాడుతూ భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం ఈ ప్రాంత రైతులను పార్టీ ఒప్పించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వారికి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేసిందన్నారు. బీటీపీఎస్ నిర్మాణం జరిగి కరెంటు ఉత్పత్తి అవుతుందంటే అది సీపీఐ పార్టీ పుణ్యమేనని అన్నారు. పార్టీ పుట్టి వంద సంవత్సరాల అయిన సందర్భంగా డిసెంబర్ 26 నుండి పార్టీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పులిగిల్లి రమేష్, గ్రామపంచాయతీ మాజీ సీపీఎం వార్డు మెంబర్ చీడం బాబురావుతోపాటు మరికొందరు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు తోట రమేష్, రాజుగారు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి వెంకటేశ్వర్లు



**చర్ల, డిసెంబర్ 01, మహా:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద గుంజి మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన చర్ల మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్నటువంటి 30 లక్షల మంది నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి బోర్డును కార్మిక సంఘాల నాయకులతో నిర్మించి కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేర్పుల మల్లికార్జున్ మాట్లాడుతూ అదనపు నిధులను కేటాయించి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో సంక్షేమ బోర్డును ప్రైవేటుపరం చేసే ఆలోచనను విరమించుకొని కార్మికుల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలని ఆయన కోరారు కార్మికులను, కార్మిక నాయకులను చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాలకు సిద్ధం చేసేందుకు ఈనెల 4, 5 తేదీలలో పాల్వంచలో జరగనున్న రాష్ట్రస్థాయి రాజకీయ సైతాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఆర్లగడ్డ తాతాజీ, సీపీఐ మండల కార్యదర్శి రూప పోతయ్య, యూనియన్ నాయకులు సాయిల తిరుపతి, అనిల్, రాంబాబు, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

## గుమ్మడివెల్లి రైతుల రాస్తారోకో



**అశ్వారావుపేట, డిసెంబర్ 1, మహా:** అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివెల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఇటీవల భారీ వర్షాలు కారణంగా పెద్దవాగు ప్రాజెక్టు ఆనకట్ట కొట్టుకుపోవడంతో నీటి నిల్వలు తగ్గిపోయాయని, దీంతో 12 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయిందని, మిగిలి ఉన్న నీటిని కొందరు అక్రమంగా తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. తమకు చెందాల్సిన నీళ్లను తమకే కావాలి అంటూ వారు నినాదాలు చేశారు. నీటి అక్రమ తరలింపును అడ్డుకోవాలని, ప్రాజెక్టు పునరుద్ధరణను త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు స్వెటర్స్ పంపిణీ చేయాలి

### దుర్గం ప్రేమ్ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 1, మహా:** చలి తీవ్రత పెరుగుతున్న దృశ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గురుకులాలు, కస్తూరిబా, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో ఉంటున్నటువంటి విద్యార్థిని, విద్యార్థులకు స్వెటర్స్, దుప్పట్లు, బ్లాంకెట్లు పంపిణీ చేయాలని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా దుర్గం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చలి తీవ్రత పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్, బాడిశ సుహాష్, జాడి దినేష్, దుర్గం సురేందర్, గోగు సాంబశివరావు, జాడి వినయ్, దుర్గం ప్రసాద్, గోగు సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 1, మహా:** ఇల్లందు నియోజకవర్గంలో నేడు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొననున్నారు.



## నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా :** కేంద్ర డిజాస్టర్ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటించనందున జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉండరని, రేపటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

## భద్రాద్రి ఆలయంపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

### మాస్టర్ ప్లాన్ తో ప్రణాళికలు

- సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు
- ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నిర్ణయం
- పుష్కరకాలం తర్వాత ఏర్పడనున్న పాలకమండలి
- దేవస్థాన పాలకమండలి ఛైర్మెన్ పదవికి తీవ్ర పోటీ
- పాలకమండలిలో ఆదివాసీలకు చోటు కలిపించాలని వినతి



**ఛైర్మన్ పదవికి తీవ్ర పోటీ**

**12 ఏండ్ల తర్వాత కొలువు తీరనున్న పాలక మండలిలో చోటు కోసం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్‌ల ప్రధాన అనుచరులు ఈ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే, ఎంపీ అనుచరులతోపాటు రాష్ట్రంలోని ప్రముఖులు సైతం తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. దీంతో రామాలయ పాలకమండలి ఏర్పాటులో రసవత్తర పోటీ నెలకొంది.**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** దక్షిణ అయోధ్యగా, రాములోరు నడియాడిన నేలగా, వైకుంట రాముని దివ్య క్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలం సీతారామ చంద్రస్వామి ఆలయం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మాస్టర్ ప్లాన్ రూపొందించి సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు ఆలయ కమిటీని ఏర్పాటు చేసేందుకు కసరత్తులు ముమ్మరం చేసింది. ట్రస్టు బోర్డు ఏర్పాటు నిర్ణయంతో రామయ్య ఆలయ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి.

**పుష్కర కాలం తరువాత ట్రస్ట్ బోర్డు**

భద్రాద్రి రాములోరి ఆలయానికి ట్రస్ట్ బోర్డు లేక పుష్కర కాలం దాటింది. చివరి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చివరిసారిగా భద్రాద్రి రామాలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేసి ఛైర్మన్, సభ్యులను నియమించారు. 2012 సంవత్సరంలో ఆ ట్రస్ట్ బోర్డు పదవీకాలం పూర్తి అయిన తర్వాత 12 సంవత్సరాలుగా రామాలయానికి ట్రస్ట్ బోర్డును పాలకులు నియమించలేదు. ఈ నేపథ్యంలో పుష్కర కాలం తర్వాత నూతన 14వ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 11న దేవాదాయశాఖ ఇచ్చిన ప్రకటనతో పాలక మండలి పదవులను ఆశిస్తున్న పలువురి ఆశావహుల్లో నూతనోత్సాహం నెలకొంది.

**బీఆర్ఎస్ పాలనలో నిరాశే..**

బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారం చేపట్టినా రామాలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటును పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. రెండు పర్యాయాలు ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో ఆలయంలో పాలకవర్గం కొలువుతీరలేదు. రామాలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పాలక మండలి ఏర్పాటుకు అదిగో.. ఇదిగో ప్రకటనలే ఇచ్చారే తప్ప కార్యారూపం దాల్చడంలేదని, భద్రాద్రి రామాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ప్రకటించిన రూ. 100 కోట్లలో ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని, ఏటా రూ. 50 కోట్లకు పైబడి ఆదాయం వచ్చే ఈ దేవస్థానానికి ట్రస్టు బోర్డును నియమించకపోవడం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని, శ్రీరామ భక్తులు ఆరోపిస్తున్నారు.

**సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు**

భద్రాచల రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఎన్ని నిధులైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు ప్రకటించారు. ఈ మేరకు ఎండోమెంట్, రెవెన్యూ అధికారులతో ఆలయ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా సమీక్షలు జరిపారు. అధికారులు రామాలయం చుట్టూ స్థల సేకరణ కొరకు గృహయజమానులతో అనేక దఫాలుగా చర్చలు నిర్వహించారు. ప్రస్తుతం భద్రాచల ఆలయం అభివృద్ధి, ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గతంలో ప్రకటించిన థీమ్ పార్క్, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ప్రసాద్ ఫండ్స్ తదితర నిధులు ఉపయోగించి నూతన కట్టడాలు నిర్మించి అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు సిద్ధంచేయగా, ఈ కార్యక్రమాలు కార్యరూపం దాల్చేందుకు ప్రధానంగా స్థలాల సమస్య ఎదురవుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో ఆలయం అభివృద్ధి జరిగడం లేదని భద్రాద్రి వాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన అవసరం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి







**కొత్తగూడెం, డిసెంబర్ 1, మహా:** ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తగూడెం ఓల్డ్ డిపో నుండి భద్రాచలం రోడ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పాటించాలన్నారు. యుక్త వయసు వారు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ మహమ్మారి బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎయిడ్స్ సోకినవారిని చులకనగా చూడవద్దని, వారి పట్ల వివక్ష చూపరాదని తెలిపారు. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన అవసరం అని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ఏమైనా అనుమానం ఉన్నట్లయితే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ యువత చెడు మార్గాలను ఎంచుకొని హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడుతున్నారని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారితో సహజీవనం, కలిసి ఉండటం, కలిసి భుజించడం వలన వ్యాధి రాదని, రక్త మార్పిడి, సూదులు, లైంగిక సంబంధాల వల్ల వ్యాధి సోకుతుందని తెలిపారు. డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎల్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల విద్యార్థులకు కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్, న్యాయవాది మెందు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.